VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
: 91(40) 27628184, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 189, పేజీలు - 08
ఆదివారం, డిసెంబర్ 21, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456



## బంధుప్రీతితో రెబల్స్‌ను
# బుజ్జగించలేకపోయారు

### ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి సీరియస్ క్లాస్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో అత్యంత కీలకమైన పల్లె పోరు ముగిసింది. మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్నే అందించాయి. రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి తీర్పు హస్తంవైపు మొగ్గు చూపినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ భారీ విజయం వెనుక ఉన్న ఉత్సాహాన్ని పక్కనపెట్టి పార్టీలోని అంతర్గత లోపాలను సరిదిద్దే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారు. గెలిచామన్న గర్వం కంటే, పార్టీ క్రమశిక్షణే ముఖ్యం అన్నట్టుగా అధిష్ఠానం వ్యవహరించిన తీరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**సంఖ్యల సాక్షిగా.. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యం**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురు వేసింది. మూడు విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంటూ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. తుది లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12, 733 పంచాయతీ సర్పంచి పదవులకు గానీ దాదాపు ఏడు వేలకుపైగా కాంగ్రెస్ మద్దతు దారులు గెలుచుకున్నారు.

**30 జిల్లాల్లో క్లీన్ స్వీప్.. సిద్ధిపేట ఒకటే మినహాయింపు**

రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఎన్నికల కోలాహలం నెలకొనగా, కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని చాటుకుంది. ఒక్క సిద్ధిపేట జిల్లా మినహా, మిగిలిన 30జిల్లాల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. ముఖ్యంగా

2లో..

## మమతా బెనర్జీ ప్రభుత్వంపై
# విమర్శలు

### బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ



**న్యూఢిల్లీ** పశ్చిమ బెంగాల్‌లోని నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేకపోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఎప్పుడూ ఆపబోమని

2లో..

## ఆర్థిక సంవత్సరానికి
# బడ్జెట్ రూపకల్పన

- అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను కోరిన ఆర్థిక శాఖ
- ఫిబ్రవరి లేదా మార్చి నెలలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో బడ్జెట్ కసరత్తు ప్రారంభమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పనకు తెలంగాణ ఆర్థిక శాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను కోరింది. జనవరి 3వ తేదీలోపు ప్రతిపాదనలు పంపించాలని ఆర్థిక శాఖ అన్ని శాఖలకు సూచించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సవరించిన ప్రతిపాదనలు కూడా పంపాలని కోరింది. అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత, శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులతో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్షలు జరిపి బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై చర్చిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత ఏడాది

2లో..

## చిన్న ఆలోచనలే ఒక్కోసారి
# గొప్ప అభివృదికి బాటలు వేస్తాయి

- అనకాపల్లిలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలుకు నిర్ణయం
- వ్యక్తిగత శుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచడమే కార్యక్రమ లక్ష్యం
- పార్వతీపురం మన్యం కలెక్టర్ ఆలోచనను ప్రశంసించిన ముఖ్యమంత్రి

అమరావతి (ప్రశ్న న్యూస్) చిన్న చిన్న ఆలోచనలు ఒక్కోసారి అభివృద్ధికి, గొప్ప మార్పులకు బాటలు వేస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొన్ని ఆలోచనలు సమాజంలో విప్లవాత్మక మార్పులు తెస్తాయని, 'ముస్తాబు' అలాంటి కార్యక్రమమేనని తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం

2లో..



## పీపీపీ అంటే ప్రైవేటీకరణే అని వైసీపీ ఫిక్స్

- అదే రాజకీయ అస్త్రం, టీడీపీ తిప్పికొట్టలేకపోతోందా?

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం ,నిర్వహణను పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌లో చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రస్తుతం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ముఖ్యంగా పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని ప్రభుత్వం వాదిస్తుండగా, ఇది పేదలకు వైద్యం దూరం చేసే ప్రైవేటీకరణే అని వైసీపీ

2లో..



## డీలిమిటేషన్‌కు లైన్ క్లియర్

### - వార్డులకు కొత్త పేర్లు.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగర పాలనలో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డుల పునర్విభజన ప్రక్రియకు ఎట్టకేలకు న్యాయపరమైన చిక్కులు తొలిగిపోయాయి. నగర విస్తీర్ణం, పెరిగిన జనాభాకు అనుగుణంగా వార్డుల సంఖ్యను పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయం అమలుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన తుది అధికారిక ప్రకటన వెలువడడమే తరువాయి. నగర ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ భారీ




2లో..

## ఉపాధి హామీ పథకంపై
# కేంద్రం బుల్డోజర్

- సోనియా గాంధీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్

2లో..

## ఇక ప్రజల్లోకి కేసీఆర్

### - చిట్‌చాట్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- కేసీఆర్ బహిరంగ సమావేశాలపై నేడు నిర్ణయిస్తామని వెల్లడి
- రేవంత్ రెడ్డిని మాత్రం తాను ఫుట్‌బాల్ ఆడుకుంటానని వ్యాఖ్య
- తాను ఫెయిల్యూర్ లీడర్‌ను కాదన్న కేటీఆర్
- రేవంత్ పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో 7 ఉపఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్టి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హనీమూన్ పీరియడ్ ముగిసిందని, ఇకపై పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ కిట్టీ పార్టీ ఆంటీ మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

2లో..

## జగన్‌కు పవన్
# స్ట్రాంగ్ వార్నింగ్

- చర్యలు తీసుకుంటే జగన్ అడ్రస్ గల్లంతేనని వ్యాఖ్య

**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత జగన్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని వారు ఇప్పుడు మళ్లీ వస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. కిరాయి గ్యాంగ్‌లపై రాజకీయంగా చర్యలు తీసుకుంటే, అప్పుడు జగన్ ఎక్కడుంటారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. అవసరమైతే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరహా విధానాలు అవలంబించడానికి కూడా వెనుకాడబోమని

2లో..



## పర మతాలను కించపరిస్తే
# కఠిన చర్యలు

- శిక్షించేలా కొత్త చట్టం తెస్తామన్న సీఎం రేవంత్
- ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- డిసెంబర్ నెల కాంగ్రెస్ పార్టీకి ఎంతో కీలకమన్న ముఖ్యమంత్రి
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో హేట్ రేట్ చట్టం తీసుకువస్తామని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రజలు నచ్చిన మతాన్ని ఆచరించవచ్చని, ఎవరైనా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడితే కఠినంగా ప్రభుత్వం శిక్షిస్తుందని సీఎం

2లో..



# పర మతాలను కించపరిస్తే కఠిన చర్యలు

రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించేందుకు కర్ణాటక రాష్ట్రంలో ఇటీవలే తెచ్చిన కొత్త చట్టాన్ని రాష్ట్రంలోను ఈ బడ్జెట్ సమావేశాల్లో తేనున్నట్లు చెప్పారు. ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

### డిసెంబర్ - ఒక అద్భుతాల మాసం

"డిసెంబర్ నెల కేవలం క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలకు మరియు కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక 'మిరాకిల్ మంత్' (అద్భుతాల మాసం)" అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఇదే నెలలో జన్మించినట్లు చెప్పారు. వందలాది మంది తెలంగాణ రాదని ఆత్మహత్యలు చేసుకుంటుంటే సోనియాగాంధీ భారీ రాజకీయ మూల్యం చెల్లించి మరీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని చెప్పారు. అదే రీతిలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ( కాంగ్రెస్ ) ఏర్పడింది కూడా ఇదే డిసెంబర్ నెలలో కావడం విశేషమని ఆయన గుర్తు చేశారు.

### యేసు ప్రభువు బోధనలే మాకు స్ఫూర్తి

మానవ సేవయే మాధవ సేవగా భావించి, ద్వేషించే వారిని సైతం ప్రేమించాలన్న ఏసుక్రీస్తు సందేశం ప్రపంచానికి ఎంతో అవసరమని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభువు బోధనల స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎవరు దుష్ప్రచారం చేసినా రాష్ట్రంలో శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

### సంక్షేమ పథకాల వెల్లువ

పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం ఈ సందర్భంగా వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, సొంత ఇల్లు లేని పేదలకు వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తూ పేదల ఇళ్లలో వెలుగులు నింపామని. 3 కోట్ల 10 లక్షల మంది పేదలను మా కుటుంబ సభ్యులుగా భావించి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ చేయడమే కాకుండా, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చాం.

### విద్య, వైద్య రంగ అభివృద్ధికి క్రైస్తవ మిషనరీలు యుద్ధం మాదిరి కృషి చేశారు.

ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తే అదే అంకితభావంతో క్రిస్టియన్ మిషనరీలు పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించాయని సీఎం కొనియాడారు. ప్రభుత్వంతో పోటీ పడి వారు చేస్తున్న సేవలు ఒక యుద్ధంలా, యజ్ఞంలా సాగాయని అభినందించారు. క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలు ఆమోఘమని సీఎం రేవంత్ ప్రస్తుతించారు.

### మత విద్వేషాలపై ఉక్కుపాదం - కొత్త చట్టం

రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడటంపై సీఎం కఠిన వ్యాఖ్యలు చేశారు. "ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలి. ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడితే కఠినంగా శిక్షించేలా శాసనసభలో చట్టాన్ని సవరిస్తాం" అని ఆయన ప్రకటించారు.

మత ప్రాతిపదికన దాడులకు పాల్పడే వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఈ చట్టం తెనున్నట్లు చెప్పారు. కర్ణాటకలో ఇటీవలే కాంగ్రెస్ సర్కార్ ఇలాంటి చట్టం తెచ్చినట్లు వివరించారు.

### మైనారిటీల సంక్షేమం అనేది దయ కాదు - మైనార్టీల హక్కు

మైనారిటీలకు అందుతున్న సంక్షేమ పథకాలు ఎవరి దయ కాదని, అవి వారి హక్కు అని సీఎం స్పష్టం చేశారు. క్రిస్టియన్, ముస్లిం స్మశాన వాటికల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 'తెలంగాణ రైసింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ద్వారా అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# డీలిమిటేషన్‌కు లైన్ క్లియర్

కసరత్తు సాగుతోంది. వార్డుల విభజనపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం, ఈ ప్రక్రియను ఆపాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రాథమిక ప్రకటన విడుదల చేసిన తర్వాత ప్రజల నుంచి దాదాపు 5,905 అభ్యంతరాలు , సూచనలు అందాయి. ముఖ్యంగా జనాభా లెక్కలు, మ్యాపుల విషయంలో స్పష్టత కోరిన వారికి అవసరమైన వివరాలు అందజేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో పాలనాపరమైన అడ్డంకులు తొలగి.. తుది నిర్ణయానికి మార్గం సుగమమైంది. ఈ విభజన ప్రక్రియలో అధికారులు అత్యంత శాస్త్రీయ పద్ధతులను అనుసరించారు. 2011 జనాభా లెక్కలు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ దగ్గర ఉన్న తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి వార్డులో సగటున 45 వేల మంది జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దీనికి పది శాతం అటు ఇటుగా మార్పులు చేసే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం ఉన్న 150 వార్డుల సంఖ్యను 300కు పెంచడం వల్ల ప్రతి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం కలుగుతుంది. వార్డుల సంఖ్య ఖరారైన వెంటనే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక పనులు ప్రారంభం కానున్నాయి. కొత్తగా ఏర్పాటైన వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. ఈ విషయంలో కూడా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. అన్ని ప్రక్రియలు ముగిశాక, ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. అయితే 2027లో కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల వరకు వేచి చూస్తారా లేక ముందే వెళ్తారా అన్నది వేచి చూడాలి. వార్డుల పునర్విభజనలో పేర్ల మార్పుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

దశాబ్దాలుగా ఉన్న తమ ప్రాంతం పేరును మార్చడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈ సెంటిమెంట్‌ను గౌరవించిన ప్రభుత్వం, అధికారులు విభజన తర్వాత కూడా వీలైనంత వరకు పాత పేర్లనే కొనసాగించాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రజల గుర్తింపు చెక్కుచెదరకుండా ఉంటుంది. నగర పాలనలో వార్డుల సంఖ్య పెరగడం వల్ల నిధుల కేటాయింపులో, 'సమస్యల పరిష్కారంలో పారదర్శకత పెరుగుతుంది. గతంలో ఒక్కో కార్పొరేటర్ లక్షలాది మంది జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చేది దీనివల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం కష్టమయ్యేది. ఇప్పుడు వార్డు విస్తీర్ణం తగ్గడం వల్ల డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఇది రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో ఒక అనివార్యమైన ముందడుగుగా చెప్పుకోవచ్చు.

# పీపీపీ అంటే ప్రైవేటీకరణే అని వైసీపీ ఫిక్స్

ఆరోపిస్తోంది. అదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది.

### 17లో పీపీపీ మోడల్‌లోకి 10 మెడికల్ కాలేజీలు

రాష్ట్రంలో గత ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభఇంచిన 17 మెడికల్ కాలేజీలను పూర్తి చేయడం ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ప్రభుత్వానికి భారంగా మారింది. ప్రభుత్వ నిధులపై భారం తగ్గించుకుంటూ, మౌలిక సదుపాయాలను వేగంగా పూర్తి చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం 10 కాలేజీలకు పీపీపీ విధానాన్ని ఎంచుకుంది. పీపీపీలో ప్రభుత్వం భూమిని ఇస్తే, ప్రైవేట్ భాగస్వామి పెట్టుబడి పెట్టి భవనాలు నిర్మించి, నిర్ణీత కాలం పాటు నిర్వహిస్తారు. తర్వాత ప్రభుత్వానికి బదలాయిస్తారు. మాజీ సీఎం జగన్ ఈ అంశాన్ని భారీ కుంభకోణం"గా అభివర్ణిస్తోంది. ప్రభుత్వ భూమిని, కోట్లాది రూపాయల విలువైన ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మెడికల్ సీట్ల ధరలు పెరుగుతాయని, పేదలకు ఉచిత వైద్యం అందదని ప్రచారం చేస్తూ, దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమాన్ని కూడా చేపట్టారు. ప్రైవేట్ సంస్థలు లాభాల కోసం చూస్తాయి కాబట్టి, చివరికి ఇది పేదల వైద్యానికి గొడ్డలిపెట్టు అవుతుందని వారి వాదన.

### పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదంటున్న ప్రభుత్వం

ప్రైవేటీకరణ ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చుతోంది. పీపీపీలో ఉన్నప్పటికీ, ఈ కాలేజీలు ప్రభుత్వ పేరుతోనే నడుస్తాయని, నిబంధనలు కూడా ప్రభుత్వమే నిర్దేశిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఈ కాలేజీల్లో 70% సేవలు ఎన్టీఆర్ వైద్య సేవ కింద పేదలకు ఉచితంగా అందుతాయి. 50% సీట్లు జనరల్ కేటగిరీలో కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ఒప్పంద కాలం ముగిసిన తర్వాత ఆస్తులన్నీ తిరిగి ప్రభుత్వం వశమవుతాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారు. పీపీపీ మోడల్ అనేది విజయవంతమైన మోడల్ అంటోంది. పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ఇదే సిఫారసు చేసింది. ఆ స్థాయీ సంఘంలో వైసీపీ ఎంపీ గురుమూర్తి కూడా సభ్యుడిగా ఉన్నారు.

### తిప్పికొట్టలేకపోతున్న టీడీపీ

నిజానికి, ఉత్తరప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పీపీపీ మోడల్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అయితే, ఏపీలో ఇది అభివృద్ధి వర్సెస్ సంక్షేమం అనే రాజకీయ పోరుగా మారింది.

జగన్ పాలనలో జరిగిన ఆర్థిక తప్పిదాల వల్లే నేడు పీపీపీకి వెళ్లాల్సి వచ్చిందని ప్రభుత్వం విమర్శిస్తుండగా, పేదలకు వైద్యం అమ్మేస్తున్నారని వైసీపీ ఎదురుదాడి చేస్తోంది. పీపీపీ, ప్రైవేటీకరణ మధ్య ఉన్న సాంకేతిక వ్యత్యాసాన్ని విస్మరించి, దీనిని ఒక బలమైన రాజకీయ అస్త్రంగా మార్చుకోవడంలో వైసీపీ విజయం సాధించినట్లే కనిపిస్తోంది. ప్రభుత్వం దీనిపై ప్రజలకు మరింత లోతుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది

చిన్న ఆలోచనలే ఒక్కోసారి
గొప్ప అభివృదికి బాటలు వేస్తాయి

చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ముస్తాబు కార్నర్'ను సీఎం పరిశీలించి, విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమం నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు కానుందని చంద్రబాబు ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఒక అధికారి చొరవతో మొదలైన మంచి పనిని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. పాఠశాలకు చక్కటి యూనిఫాంతో, పరిశుభ్రంగా రావాలి. చక్కగా తల దువ్వుకోవడం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవడం వంటి మంచి అలవాట్ల వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఈ ముస్తాబు కార్యక్రమానికి అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ పెరగడమే కాకుండా, నాయకత్వ లక్షణాలు కూడా అలవడతాయి" అని వివరించారు. రాష్ట్రంలోని 75 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. "మీరంతా రాష్ట్రానికి గొప్ప ఆస్తి. అందుకే అమ్మకు వందనం ద్వారా ఆర్థిక సాయం, నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నాం. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే చిన్నతనం నుంచే కృషి చేయాలి. విద్యార్థులంతా నాలెడ్జ్ ఎకానమీలో భాగం కావాలి" అని ఆకాంక్షించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో వినూత్న సంస్కరణలు తీసుకొస్తున్నారని, విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు మంత్రులందరూ కృషి చేస్తున్నారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# బంధుప్రీతితో రెబల్స్‌ను బుజ్జగించలేకపోయారు

నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి కీలక జిల్లాల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఇంత ఘన విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం పార్టీ వైఫల్యాలపై లోతైన విశ్లేషణ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షితో కూడిన బృందం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఫలితాలపై సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో కొందరు ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 18 మంది ఎమ్మెల్యేల పని తీరుపై రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు సమాచారం. పార్టీ గెలిచినా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక నేతల మొండివైఖరి వల్ల పార్టీకి నష్టం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారని తెలుస్తోంది.

### రెబల్స్ నిర్వహణలో వైఫల్యం, బంధు ప్రీతిపై ఆగ్రహం

### రెబల్స్ సమన్వయం లోపంబీ-

ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా నిలబడిన రెబల్స్‌ను బుజ్జగించడంతో, వారిని సమన్వయం చేయడంలో దాదాపు 16 మంది ఎమ్మెల్యేలు విఫలమయ్యారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దీని వల్ల ఓట్లు చీలి పార్టీకి తీరని నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

### బంధు ప్రీతిపై ఆగ్రహం:-

కొందు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలు తమ సొంత బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని అధిష్ఠానం తీవ్రంగా తప్పుపట్టింది. అర్హులైన కార్యకర్తలను కాదని, బంధువులకు టికెట్ ఇవ్వడం పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి రిపీట్ అయితే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి , నియమ నిబంధనలు పాటిస్తూ పని చేయాలని తమ వైఖరి మార్చుకోవాలని ఆదేశించారు. అధికారంలో ఉన్నామన్న అశ్రద్ధ పనికిరాదని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు.

### అధికారం అంటే బాధ్యత, అలంకారం కాదు

తెలంగాణ పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు తిరుగులేని బలాన్ని ఇస్తే, మరోవైపు అంతర్గత ప్రక్షాళనకు అవసరమైన సంకేతాలను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ విజయాన్ని కేవలం అంకెల్లోనే చూడటం లేదు. క్షేత్రస్థాయిలో నాయకత్వ జవాబుదారీతనాన్ని కోరుకుంటోంది. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకపోతే భవిష్యత్‌లో పార్టీ నుంచి కఠిన చర్యలు తప్పవు అన్న సందేశం సమావేశం ద్వారా స్పష్టమైంది.

మమతా బెనర్జీ ప్రభుత్వంపై విమర్శలు

ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమతా బెనర్జీ పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన

పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు లక్ష కోట్ల రూపాయలు వచ్చినట్లు అంచనాలు ఉన్నాయి. మార్చి నాటికి పన్నుల వసూళ్లు బాగా పుంజుకుంటాయని భావిస్తున్నారు.

# ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్

నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ–జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా నిలిచిందని తెలిపారు. అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు. "20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను" అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# జగన్‌కు పవన్ స్ట్రాంగ్ వార్నింగ్

స్పష్టం చేశారు. ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో రూ.3,050 కోట్ల వ్యయంతో చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ జగన్‌పై విమర్శలు గుప్పించారు. "విదేశాల్లో కూర్చుని మాట్లాడేవారిని, ఇక్కడుండి మేమొస్తే అంటూ బెదిరించే వారిని ఏం చేయాలి?" అని పవన్ ప్రశ్నించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించిందని, చిన్న వయసులోనే పిల్లల మనసుల్లో కులాల పేరుతో విషబీజాలు నాటడం సమాజాన్ని వెనక్కి నెట్టడమేనని విమర్శించారు. తాను ప్రజల మధ్య ఉండే వ్యక్తినని, ఇంట్లో కూర్చుని రాజకీయాలు చేయనని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం నిర్మాణాత్మక సూచనలను స్వాగతిస్తుందని, అదే సమయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోదని పవన్ కల్యాణ్ తెలిపారు. 'అమరజీవి జలధార' ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని, ఇది ఏ ఒక్క కులానికో, వర్గానికో సంబంధించింది కాదని, ప్రజలందరి ప్రాజెక్ట్ అని ఆయన స్పష్టం చేశారు.

## పేద ప్రజల నోటికాడ ముద్దను లాగేయడమే బి జే పి ప్రభుత్వ అంతిమ లక్ష్యం : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (యంజీ నరేగా) పథకాన్ని రద్దు చేసి వీబీ – జీ – రామ్ – జీ పేరుతో బిల్లును లోక్ సభ లో మందబలం ఉందనే ఉద్దేశంతో బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదింంప చేసుకున్న తీరుకు,ఈ పథకంలో గాంధీజీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ టిపిసిసి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఓఉ రోడ్ లోని గాంధీజీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు .ఈ ధర్నాలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.ధర్నా ను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీగణేష్ మీడియాతో మాట్లాడుతూ ?? జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేద ప్రజల నోటికాడ ముద్దను లాగేయడమే బి జే పి ప్రభుత్వ అంతిమ లక్ష్యం . బిల్లు కేవలం పేరు మార్పు కోసం చేసింది కాదు . బి జే పి ప్రభుత్వం దేవుళ్ళ పేరుతో పథకాలు తీసుకొస్తూ,చేసేవి మాత్రం దెయ్యాల పనులు. బి జే పి ప్రభుత్వం పథకాలలో గాంధీ, నెహ్రూ ల పేర్లు మార్చగలరేమో గానీ, ప్రజల హృదయాల్లో నుంచి వారిని వేరు చేయలేరు. ఈ కొత్త చట్టం ద్వారా రాష్ట్రాల, స్థానిక సంస్థల హక్కులను హరించడమే బి జే పి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం . గతంలో కేద్రం 90%,రాష్ట్రాలు 10% నిధులు భరిస్తే ఈ కొత్త చట్టం ప్రకారం రాష్ట్రాలు 40% భరించాల్సి వస్తుంది. తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకుని పాత పథకాన్ని, మహాత్మా గాంధీ గారి పేరుతోనే కొనసాగించాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుల వారితో పాటు గౌరవ మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు



**శ్రీశైలం** శ్రీశైల దేవస్థానంలో తెల్లవారుజామున శ్రీశైలం దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వద్ద వేద పండితులు భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి విభూతి, కుంకుమ ధరింపజేసి ప్రదక్షిణ మార్గం ద్వారా ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు. ×మొదటగా ధ్వజస్తంభానికి నమస్కరించి శివ సంకల్పం చేశారు. అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. తరువాత మూలవిరాట్ శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి మహా మంగళహారతి, మంత్రపుష్పం అనంతరం పంచామృతాలతో శత రుద్రాభిషేకం, బిల్వార్చన, మల్లికా పుష్పాలతో మహా మంగళహారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించి దర్శనం చేసుకున్నారు. తదుపరి నందీశ్వర దర్శనం చేసి, అర్చకుల చేత స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వృద్ధ మల్లికార్జున స్వామి లఘుభిషేకం, సరస్వతి నది అంతర్వాహినిగా ప్రసిద్ధి చెందిన మల్లికాగుండం వద్ద శ్రీ స్వామివారి గర్భాలయ త్రిశూల దర్శనం చేసుకున్నారు. తదుపరి కుమారస్వామిని దర్శించుకున్నారు. తదుపరి భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు శ్రీ భ్రమరాంబ అమ్మవారి ముఖ మండపంలో ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించి, షోడశోపచార పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం అమ్మవారి హారతి స్వీకరించారు. తరువాత వేదాశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాలు మరియు శేష వస్త్రాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి భారత ఎన్నికల కమిషనర్ గారికి సమర్పించారు. అనంతరం గోకులంలో గోమాత పూజను సాంప్రదాయ బద్దంగా నిర్వహించుకున్నారు నిర్వహించినారుఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్ ఆలయ ఈఓ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు

# ఇక ప్రజల్లోకి కేసీఆర్

కరేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు కానీ, నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటాను అంటూ సవాల్ విసిరారు. రాజకీయాల్లో సంస్కారం ఉండాలని, రేవంత్ రెడ్డి మాదిరిగా తాను ఎదుటివారి కుటుంబ సభ్యులు, మహిళలు లేదా చిన్నపిల్లల గురించి చిల్లర రాజకీయాలు చేయనని కేటీఆర్ పేర్కొన్నారు. తానెప్పుడూ హుందాగా రాజకీయం చేయడానికే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్ కేసుల్లో ఏమీ లేదని ఇప్పటికే రేవంత్‌కు అర్థమైందని, అందుకే ఈ కేసులను అంతులేని కథలా సాగదీస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక కాలు కాంగ్రెస్‌లో, మరొక కాలు బీజేపీలో ఉంచి రెండు పడవల ప్రయాణం చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కూర్చుని మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నామనటం పెద్ద కామెడీ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ చెప్తున్నట్లు తన ప్రభుత్వం పట్ల ప్రజల్లో 66 శాతం మొగ్గు ఉంటే.. వెంటనే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలి అని సవాల్ విసిరారు. ఉప ఎన్నికలకు వెళ్లే దమ్ము రేవంత్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన 7 ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, కానీ తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక అనేక స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించామని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల తెలంగాణలోని పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విరూపాక్ష వంటి కంపెనీలు కర్నూలుకు వెళ్ళిపోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని, విద్యా ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు ఇవ్వకుండా కేవలం పార్టీ పదవులకే పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలే రేవంత్ రెడ్డి పాలనకు అసలైన సూచిక అని, సింబల్‌పై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు.

ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతలతో రేవంత్ రెడ్డికి లోపాయికారీ ఒప్పందం ఉందని కేటీఆర్ ఆరోపించారు. బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి రేవంత్ ఎందుకు వెళ్లారో, బీజేపీ ఎంపీ రేవంత్ ఇంటిని ఎందుకు రీమోడల్ చేయించారో బీజేపీ నేతలే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రమేష్ వంటి వారికి కాంట్రాక్టులు ఇస్తూ రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి స్నేహం చేస్తున్నారని విమర్శించారు. ఇకపోతే గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాలనే ఆలోచన శాస్త్రీయంగా లేదని, దీనిపై తమ నాయకులు జీహెచ్ఎంసీ సమావేశంలో నిలదీశారని తెలిపారు.

### అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు

# బి.ఎల్.ఏ. జాబితా ఇవ్వండి

**- నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎన్. మౌర్య.**





**తిరుపతి** నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను అందజేయాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను వీలైనంత త్వరగా అందజేయాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఇప్పటివరకు వచ్చిన వివిధ దరఖాస్తుల పరిష్కారం గూర్చి ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**- నగర పంచాయతీ కమిషనర్**



**బేతంచర్ల** పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యమని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బేతంచర్ల పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఫజల్ రెహమాన్ మాట్లాడుతూ మన చుట్టూ పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని లేకపోతే రోగాల బారిన పడతామని ఆయన సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జీ రాం జీ పేరుతో తెచ్చిన కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి



**తుగ్గలి:** : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని రద్దుచేసి ఆ స్థానంలో జీ రాం జీ పేరుతో తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు రంగరాజు,రైతులు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005లో మహాత్మా గాంధీ పేరుతో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో కోట్ల మందికి హామీ లేకుండా గ్యారెంటీ అనే అంశాన్ని కాలరాశి,జాతిపిత మహాత్మా గాంధీ పేరు స్థానంలో జీ రాం జీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, 2005 ఉపాధి హామీ చట్టం అమలు జరిగిన చోట గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనతో పాటు,సామాజిక న్యాయం,ఆర్థిక స్వాతంత్రంతో పాటు భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు కల్పించిందని వారు తెలియజేశారు.వలసలు నివారించడంలో చట్టం పేదలకు ఎంతో దోహదపడిందని, లక్షలాది ఎకరాల పేదల భూమి అభివృద్ధి జరిగిందని,కరోనా సమయములో దేశమంతా చిన్న భిన్నమైన గ్రామీణ ఉపాధిహామీ చట్టం కోట్లాది మందికి ఉపాధి చూపించి అన్నం పెట్టిందని వారు తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ నందు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి ఆ చట్టంలోని కీలకమైనటువంటి అంశాలు గ్యారెంటీ మరియు 90:10 ను రద్దుచేసి రాష్ట్రాలకు భారం పడేలా 40% నిధులు ఖర్చు పెట్టాలని మరియు 73,74 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా పని హక్కును కాలరాస్తూ జీ రాం జీ చట్టం చేయడం కోట్లాదిమంది పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని వారు తెలియజేశారు.కాబట్టి 2005 మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న చట్టాన్ని యధా విధంగా అమలు చేసి ఆ చట్టాన్ని మరింత బలం చేస్తూ కుటుంబానికి రెండువందల రోజులు పని దినాలను కేంద్ర బడ్జెట్లో రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని,నూతనంగా తెచ్చిన జీ రాం జీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నిరుపేద ప్రజల ఆవేదనను గుర్తించాలని వారు తుగ్గలి తహసిల్దారు రవికు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు చంద్రయ్య,మూర్తి,సర్వేశ్,బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

# గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి అస్సాం ప్రభుత్వం 25 ఎకరాల భూమి కేటాయింపు

**- అదనపు భూమి కోసం అస్సాం సీఎంకు లేఖ రాసిన ఏపీ సీఎం - ఇరువురు సీఎంలకు కృతజ్ఞతలు తెలిపిన టీటీడీ బోర్డు చైర్మన్**

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని భారతదేశంలోనిఈశాన్య రాష్ట్రాలలోమరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. అస్సాంలోని గౌహతి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది.టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలిపిన వివరాల ప్రకారం గౌహతి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు లేఖ రాస్తూ గువాహటిలోని గర్భుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన డిసెంబర్ 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ యొక్క నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని ఏపీ సీఎం కోరారు. ఈశాన్య భారతదేశానికి గౌహతి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోరికకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గౌహతి లోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరించారు.

ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరిం చినందుకు ఆంధ్రప్రదేశ్ మరియు అస్సాం రాష్ట్రాల ముఖ్యమ ంత్రులకు టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్ నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని చైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీను నిర్వహించిన వైద్యాధికారులు**

**తుగ్గలి:** నిండు జీవితానికి రెండు చుక్కలతో పోలియోను తరిమికొట్టవచ్చని వైద్యాధికారులు తెలియజేశారు. శనివారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్,ఆయుర్వేద వైద్య అధికారి అమర్నాథ్ లు వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థుల ద్వారా పల్స్ పోలియో చుక్కలపై అవగాహన ర్యాలీను నిర్వహించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రధాన రహదారి మీదగా తహసిల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో పల్స్ పోలియో చుక్కలపై అవగాహన ర్యాలీలో నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ డిసెంబర్ 21,ఆదివారం రోజున ఐదు సంవత్సరాలలోపు గల చిన్నారులు తమ సమీపంలోని గల ఆరోగ్య కేంద్రాల వద్ద,అంగన్వాడీల వద్ద పల్స్ పోలియో చుక్కలను వేయించుకోవాలని తెలియజేశారు.ఐదు సంవత్సరాల లోపు గల చిన్నారుల తల్లిదండ్రులు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించి పోలియో రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి చేయాలని వారు తెలియజేశారు.21వ తేదీన అందుబాటులో లేని చిన్నారులకు 22,23 తేదీలలో వైద్య బృందాలు ఇంటి వద్దకు వచ్చి పోలియో చుక్కలను వేస్తారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటరమణయ్య,పిహెచ్ఎన్ సరస్వతి, సూపర్వైజర్ నాగమ్మ,హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు,కార్యదర్శి పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్,తుగ్గలి ఆశా కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువతకు

# ఉపాధి కల్పనలో ముందడుగు..

**- కడపలో మెగా జాబ్ మేళా!**

**- ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అభినందనలు**





**బద్వేలు** కడప నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శరెడ్డెప్పగారి మాధవి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి కల్పన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇస్తున్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాధవి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు లోమడా చంద్రమోహన్ రెడ్డి , 19వ డివిజన్ ఇంచార్జ్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి.



**వనపర్తి** పూరిశెట్టి సురేష్ శ్రీ వాసవి సేవాసమితి జాతీయ అధ్యక్షులు.శనివారం రోజు మధ్యాహ్నంవనపర్తి జిల్లా, కలెక్టర్ ఛాంబర్ లో శ్రీ వాసవి సేవా సమితి క్యాలెండర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ గారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాలెండర్ మల్టీ కలర్ లో మంచిగా ముద్రించినందుకు శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి ని అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వాసవి సేవా సమితి చేపట్టే కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని వారు చేసే సేవా కార్యక్రమాల్లో నేను కూడా పాలుపంచుకుంటానని నా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు భానూరు నాగేంద్రం మారం బాలీశ్వరయ్య పూరి బాలరాజు స్వామి నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ పేరుతొలగించటం దుర్మార్గం

**- ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసెందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలు**

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్**




**బద్వేలు** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, మహాత్మా గాంధీ పేరును తొలగించి జి రామ్ జి అనే పేరు చేర్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం బద్వేల్ పట్టణం,మైదుకూరు రోడ్డు గాంధీ విగ్రహం దగ్గర సిఐటియు,డివైఎఫ్ఐ, కెవిపిఎస్,ఆవాజ్ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహాన్ని మంచినీటితో శుద్ధి చేసి, పూలమాల వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి ఉపాధి హామీ చట్టాన్ని ఎలా నిర్వీర్యం చేయాలని ఆలోచిస్తూ ఉందని, ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడమే పనిగ పెట్టుకుని ప్రతి బడ్జెట్ నందు నిధుల కోత పెడుతుందని, నేడు ఏకంగా మహాత్మా గాంధీ పేరుని తొలగించి జి రామ్ జి అని పేరు చేర్చి మతపు రంగు పులుమే ప్రయత్నం చేస్తుందని వారు ఆరోపించారు.2005 చట్టం ప్రకారం వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఏడాదిలో వంద రోజులు ఎప్పుడైనా పని పొందే హక్కు ఉందని, ప్రస్తుతం అది లేకుండా పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 90% నిధులు కేంద్రం 10% నిధులు రాష్ట్రం భరించేదని ప్రస్తుత మార్పు వల్ల 60% శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించేలా మార్పు చేశారని దీనివల్ల 2,800/- కోట్ల రూపాయలు రాష్ట్రం మీద భారం పడుతుందని వారు తెలిపారు.125 రోజులకు పని పెంచినట్లు కేంద్రం చెబుతున్న అందుకు తగ్గ నిధులను కేటాయించలేదని వారన్నారు. గ్రామీణ పేదలకు వలసల నివారణకు ఎంతగానో ఉపయోగపడే ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేస్తుందని అందులో భాగంగానే పేరు మార్పుతో పాటు అనేక వ్యతిరేక మార్పులను తెచ్చిందని వారు దుయ్యబట్టారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో మరింత ఉధృతంగా కేంద్రం మీద ఒత్తిడి తెస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులుపట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్ బాషా, పట్టణ అధ్యక్షులు షేక్ సత్తార్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్,షేక్ ఆదిల్, కెవిపిఎస్ నాయకులు యస్. రాయప్ప,వృత్తి దారుల సంఘము పట్టణ కన్వీనర్ జి.నాగార్జున,నాయకులు గంప సుబ్బరాయుడు వికలాంగుల సంఘం నాయకులు వెంకటపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### శనివారం రోజున చెన్నకేశవ స్వామికు

# ప్రత్యేక పూజలు

**జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగా ప్రత్యేక పూజలు.**



**తుగ్గలి:** మండల కేంద్రమైన తుగ్గలిలో గల పురాతన దేవాలయమైన చెన్నకేశవ స్వామి కు శనివారం రోజున వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముందస్తుగా శనివారం రోజున ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్సార్సీపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైయస్సార్సీపీ జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి,వైయస్సార్సీపి నియోజకవర్గ ఐటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి లు చెన్నకేశవ స్వామికు పూలమాలను ధూప దీప నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా పురోహితులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేరు మీద ప్రత్యేక అర్చనలను నిర్వహించారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కు మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలియజేశారు. త్వరలో రాబోవు పంచాయితీ ఎన్నికలలో వైసీపీ పార్టీ సత్తా చాటుతుందని వారు తెలియజేశారు.ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు మండల కేంద్రమైన తుగ్గలి నందు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్సిపి శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చిన్నింటి దామోదర్ రెడ్డి,చిన్నింటి శ్రీనివాస రెడ్డి,ప్రహ్లాద రెడ్డి,భాస్కర్ రెడ్డి,చిన్నింటి ఈశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తంగడిదోన రంగారెడ్డి,ముక్కెళ్ల శేషప్ప, హోటల్ రామంజి,ఎర్రి స్వామి,కంబగిరి, బంగారు రంగన్న,బంగారు గోవిందు, పింజరి హసేని,పింజరి రజాక్,ఆటో ముని,దళాలి లాలప్ప తదితర వైఎస్ఆర్సిపి శ్రేణులు,తుగ్గలి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యా పురోగతి - ఉజ్వల హై స్కూల్

- ఉజ్వల హై స్కూల్లో ఘనంగా తల్లిదండ్రులు
- ఉపాధ్యాయుల సమావేశం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని ఉజ్వల హై స్కూల్లో శనివారం తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వి. అరుణాద్రి మాట్లాడుతూ పిల్లల చదువు, క్రమశిక్షణపై తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు, త్వరలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు రీడింగ్, రైటింగ్ నైపుణ్యాలు పెంపొందించాలని, పిల్లల భౌతిక- మానసిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దాసర్ల ఝాన్సీ రాణి ని అభినందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



అంబర్ పేట( ప్రశ్న న్యూస్) రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించే ఎన్ సి సి పరేడ్ కు ఎంపికైన ఉస్మానియా యూనివర్సిటీ లో డిగ్రీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దాసర్ల ఝాన్సీ రాణి ని కేంద్ర పర్యటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దయాకర్ యాదవ్ ఎంతో కష్టపడి ఝాన్సీరాణిని ఈ స్థాయికి తీసుకొచ్చాడు అంటే ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రుల మాటలు విని చదువుకు విలువ నిచ్చే పిల్లలు సమాజంలో చాలా తక్కువ మంది ఉన్నారని, తల్లితండ్రుల మాటలు గురువుల మాటలు వినాలని ఝాన్సీ రాణి కి మంచి భవిష్యత్తు ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, బిజెపి నాయకులు రమేష్ యాదవ్, కృష్ణ గౌడ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవలను విస్తృతం చేసేందుకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

:ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట ( ప్రశ్న న్యూస్ ) నియోజకవర్గంలో 278 మందికి స్మార్ట్ ఫోన్లను అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ఆ లక్ష్యంతోనే అంగన్వాడీ వ్యవస్థలో స్మార్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేస్తున్న 278 మంది ఐసీడీఎస్ సిబ్బందికి ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లను అందజేస్తోందని తెలిపారు. శనివారం జగ్గయ్యపేట పట్టణంలోని ఉక్కు కళా వేదిక నందు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య గారు ఐసీడీఎస్ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సేవల్లో వేగం, పారదర్శకత తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందించడం ద్వారా పిల్లల పోషణ, తల్లుల ఆరోగ్య పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు.

అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అందించిన 4జీ స్మార్ట్ ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో, ఈసారి 5జీ నెట్‌వర్క్‌కు అనుకూలంగా ఉన్న అధునాతన స్మార్ట్ ఫోన్లను అందిస్తున్నామని స్పష్టం చేశారు. అంగన్వాడీ కార్యకర్తల జీతాన్ని రూ. 11,500లకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే మినీ అంగన్వాడీలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా మార్చిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఐసీడీఎస్ సిబ్బంది అంకితభావంతో పనిచేసి కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు పూర్తి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

అంగన్వాడీ వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే కార్యకర్తల సమస్యలకు సమయానుకూల పరిష్కారం అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే తాతయ్య అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి భోజనం చేసి, వారి సేవాభావాన్ని ప్రశంసిస్తూ వారికి ధైర్యం, ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, పోచంపల్లి సొసైటీ చైర్మన్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, గౌరవరం సొసైటీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, తక్కెళ్ళపాడు సర్పంచ్ కస్మర్తి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, పేరం సైదేశ్వరరావు, అంగన్వాడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నూతన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

## కల్లుగీత కార్మిక సంఘంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో
## కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండాలి
## టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి చైతన్య గౌడ్
## సంఘం సీనియర్ నాయకులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్



ములుగు(ప్రశ్న న్యూస్) కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్. జిల్లా అధ్యక్షులు గుండె బోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ గీత కార్మికులకు పిలుపునిచ్చారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘం ఆఫీసులో సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లను ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య గౌడ్ రవి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నూతన ప్రజాప్రతినిధులు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు జరిగే ఉద్యమాలకు బాసటగా నిలవాలని అన్నారు. జిల్లాలో ఒక సర్పంచ్ ఐదు ఉపసర్పంచ్ లు 8 వార్డ్ మెంబర్లు గెలవడం జరిగిందని అన్నారు. ఇంచర్ల సర్పంచ్ ముస్నేపల్లి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేయడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులను సంఘ ఆధ్వర్యంలో సన్మానం చేయడం ఒక కల్లుగీత కార్మిక సంఘానికి దక్కుతుందని అన్నారు. 68 సంవత్సరాలుగా రాజకీయాలకు అతీతంగా కల్లుగీతకార్మికుల సమస్యల మీద ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం కల్లు గీత కార్మిక సంఘం అని అన్నారు.

అనంతరం ప్రజాప్రతినిధులను ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు తాడూరి సంపత్ కుమార్ గౌడ్.(పేరూరు) పాలకుర్తి మౌనిక గౌడ్ (లక్ష్మి పురం) పాలకుర్తి బాబు గౌడ్ (కాటాపూర్) బండి రాజశేఖర్ గౌడ్ (దుంపిల్లా గూడెం )వార్డు మెంబెర్స్ అంతటి రాము గౌడ్ బుర్ర సోమయ్య గౌడ్ గుండెబోయిన రజిత గౌడ్ మార్క రాజు గౌడ్. బుర్ర మహేష్ గౌడ్ పొన్నం రాము గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు సత్య నారాయణ గౌడ్ పులి రమేష్ గౌడ్ కారుపోతుల సత్యం గౌడ్
లోడే శ్రీనివాస్ గౌడ్ రుద్ర బోయిన మల్లేష్ గౌడ్ కాసగానిస్వామి గౌడ్ గునిగంటి శోభన్ గౌడ్ చౌగాని
స్వప్న గౌడ్ మాజీ ఎంపీటీసీ పులి నరసయ్య గౌడ్ పులి ప్రకాష్ గౌడ్ తో పాటు 40 మంది పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత నైతిక బాధ్యత ,స్వచ్ఛ ఆంధ్ర మన జీవితంలోకి భాగం కావాలి

- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట (ప్రశ్న న్యూస్ ) స్థానిక గాంధీపార్కు వద్ద స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా . రీసైక్లింగ్ విధానంలో తయారు చేసిన వస్తువులను పరిశీలించిన కలెక్టర్ స్వచ్ఛత ప్రతీఒక్కరి జీవితంలో భాగం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పరిశరాల పరిశుభ్రత, స్వచ్ఛత గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకే ప్రతీనెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతీనెలా ఒక ముఖ్యమైన అంశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వాతావరణం కల్పించే అవకాశాలు అన్న అంశంతో ఈ నెల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతోపాటు, పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, ఇతర రసాయన పదార్థాల కారణంగా పరిసరాలు విషపూరితంగా మారుతున్నాయని చెప్పారు. ప్రస్తుత, భవిష్యత్తు తరాల కోసం వీటిని నివారించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం ద్వారానే స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమమం లో మున్సిపల్ కమిషనేర్ జస్వంత్ ,తదితరులు పాల్గొన్నారు

# వ్యక్తిగత శుభ్రత విషయంలో బద్దకం వద్దు

రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కార్యదర్శి ఎం.ఎం నాయక్



నరసరావుపేట (ప్రశ్న న్యూస్ ) వసతి గృహ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో బద్ధకాన్ని విడనాడాలని రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కార్యదర్శి ఎం.ఎం నాయక్ కోరారు. స్థానిక పెద్ద తురకపాలెం గిరిజన సంక్షేమ వసతి గృహంలో నిర్వహించిన ముస్తాబు ప్రారంభోత్సవ సమావేశంలో ఎం. ఎం నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో వ్యక్తిగత పరిశుభ్రత సైతం అంతే ముఖ్యమన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమం అవసరం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి మూడు నెలలకోసారి సమీక్షించుకుని ముస్తాబు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని సూచించారు. పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు మీద శ్రద్ధ పెట్టగలమని గిరిజన సంక్షేమ వసతి గృహాల సొసైటీ కార్యదర్శి గౌతమి అన్నారు. కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ వసతి గృహంలో నేర్చుకున్న మంచి అలవాట్లు జీవితాంతం కొనసాగాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరిలో వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహిస్తూ, పర్యవేక్షించేందుకు ఐదు మంది లీడర్లను ఎంపిక చేయడం జరిగిందని, భవిష్యత్తులో లీడర్ల అవసరం లేని విధంగా విద్యార్థినులు పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులతో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించి, అద్దాలను బహుకరించారు. సమావేశంలో ఎం. ఎం నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో వ్యక్తిగత పరిశుభ్రత సైతం అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ వసతి గృహాల సొసైటీ కార్యదర్శి గౌతమి, కలెక్టర్ కృతిక శుక్లా లతో కలిసి ఎం.ఎం నాయక్ పాల్గొన్నారు.

# ఆర్టీయే కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

- నగదు స్వాధీనం

**ఖమ్మం :** రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దాదాపు 78,000 నగదు ఏజెంట్ల దగ్గర పట్టుబడ్డాయి. ఏజెంట్లనుంచి పలు డాక్యుమెంట్స్ తో పాటు ఆర్సి డ్రైవింగ్ లైసెన్స్ అవసరమయిన కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కార్యాయలంలో రవాణా శాఖ అధికారులను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గంపేట (ప్రశ్న న్యూస్ )స్వర్ణాంధ్ర - 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జగ్గయ్యపేట పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని యార్డు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూపరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడవ శనివారం తమ తమ గ్రామాలు, వార్డుల్లో తప్పనిసరిగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా పరిమితమవ్వకూడదని, పరిశుభ్రత మన నిత్యజీవితంలో భాగమవ్వాలని తెలిపారు. స్వచ్ఛత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట ఎల్ ఎస్ సి ఎస్ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు,మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అడుసుమల్లి ప్రభాకర్,ఎ ఎస్ భాస్కరరావు,కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు గుత్తికొండ శ్రీనివాసరావు, గుంజ నరసయ్య, సయ్యద్ భాష, నందమూరి శ్రీనివాసరావు, కొర్రకూటి వెంకటేశ్వర్లు, మల్లెల కొండయ్య, గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# మహిళలు మార్కెటింగ్ మెలకువలను నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలి

**సిద్దిపేట** మహిళలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలను నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారువ్యవసాయ మార్కెటింగ్ రంగంలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహించడం మరియు అడ్వాన్స్ టెక్నాలజీ పరిశీలన కోసం నాబార్డు వారి ఆర్థిక సహకారంతో సొసైటీ ఫర్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ పీపుల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారు జిల్లాలోని జిల్లా సమాఖ్య, మరియు మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు మొత్తం 25 మందిని మహారాష్ట్ర రాష్ట్రంలోనీ నాసిక్ లో గల సయ్యాద్రి ఫామ్స్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు 3 రోజుల టూరు తో పర్యటించనున్న బృందం వాహనాన్ని శనివారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళ సమాఖ్య సభ్యులకు ఇదొక సువర్ణ అవకాశం అని నాసిక్ లో గల సయ్యాద్రి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ వారు రైతు ఉత్పత్తిదారుల సమైక్య ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసి ఆర్థికంగా ఎలా విజయం సాధించారో ఈ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ప్రతి విషయాన్నీ క్లుప్తంగా నేర్చుకోవాలని తెలిపారు. ఆర్థికంగా ఎదగడం కోసం ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం హరిబాబు, అదనపు డిఆర్డిఓ సుధీర్ బాబు, డిపిఎం వాసుదేవ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

# రాంగ్‌రూట్‌లో వస్తే బండి సీజ్

- తెలంగాణలో అరైవ్ అలైవ్ స్పెషల్ డ్రైవ్



**హైదరాబాద్** తెలంగాణలో రహదారి భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 74 ప్రమాదాలు జరుగుతుండగా, సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ గణాంకాలు రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. వాహనదారుల నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతేడాది రోజుకు సగటున 52 వేల ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 72 వేలకు చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ప్రమాద ఘంటికల నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. కేవలం జరిమానాలతో మార్పు సాధ్యం కాదని భావించి, నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. అతివేగం, సిగ్నల్ జంపింగ్, మద్యం తాగి వాహనం నడపడం వంటి తీవ్రమైన తప్పిదాలపై ప్రత్యేక నిఘా పెట్టింది. రాబోయే రోజుల్లో నిబంధనలను మరింత కఠినంగా అమలు చేయనున్నారు. ముఖ్యంగా హైవేలపై రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహనాలను అక్కడికక్కడే స్వాధీనం చేసుకోవాలని యోచిస్తున్నారు. కేవలం శిక్షలే కాకుండా, మానవీయ కోణంలోనూ మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రహదారి ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయిన కుటుంబాల అనుభవాలను వాహనదారులతో పంచుకునే కార్యక్రమాలు చేపట్టనున్నారు. వారి ఆవేదనను వినడం ద్వారానైనా వాహనదారుల్లో మార్పు వస్తుందని, తద్వారా రహదారులను సురక్షితంగా మార్చవచ్చని పోలీసులు ఆశిస్తున్నారు.

# ఉపాధి హామీ పథకం రద్దుకై బిజెపి కుట్ర

## విబిజి రామ్ జి పేరుతో చేసే బిల్లు ను వెనక్కి తీసుకోవాలి

## సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ డిమాండ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఉపాధి హామీ పథకాన్ని పేరు మారుస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం బిల్లు 2025 పేరుతో సంక్షేమ పథకంగా మార్చడం సరైంది కాదని సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ అన్నారు. ఈరోజు మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ చౌరస్తా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న విభి రామ్ జి బిల్లు ప్రతులను దగ్ధం చేసి, నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వి బి జి రామ్ జి బిల్లు 2025 కొత్త పథకం గా మారుస్తూ అమలు చేయాలని నిర్ణయం చేస్తుందన్నారు. ఈ ఉపాధి హామీ పథకాన్ని 25 సంవత్సరంలో సిపిఎం పార్టీ పోరాటం చేసి పేద ప్రజలకు గ్రామాలలో పనిచేసుకోవడం కోసం సాధించడం జరిగిందన్నారు. 2025 తర్వాత ఇప్పటివరకు కూడా దేశంలో ఉన్నా ప్రతి గ్రామాలలో ఉపాధి హామీ పథకం పేరుతో పని నడుస్తుందన్నారు. కొన్ని లక్షల మంది కార్మికులు ఈ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారన్నారు. సంవత్సరానికి 100 రోజులుగా ఉన్న పని దినాన్ని 25 రోజులు పెంచుతామని బిజెపి ప్రభుత్వం చెప్తుందన్నారు. డిమాండ్ ను బట్టి నడిచే ఇప్పుడు అవసరాన్ని బట్టి చేసే పథకంగా బిజెపి ప్రభుత్వం మారుస్తుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం మాత్మ గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మారుస్తూ వి బి జి రామ్ జి పేరుతో బిల్లు పార్లమెంటులో పెట్టాలని చూస్తుందన్నారు. ఇది మాత్మ గాంధీని తీవ్రంగా అవమానపరచడమే అవుతుందని అన్నారు. దేవుని పేరుతో అన్నట్టుగా పేద ప్రజలను మభ్యపెడుతుందన్నారు. మభ్యపెడుతుందన్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ పథకం నడుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని పేద కార్మికులు లబ్ధి పొందుతున్నారు. పేరు నచ్చని మతోన్మాద పాసిస్తులు ఈ పేరు మార్పుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ పథకానికి బడ్జెట్లో 90 శాతం నిధులు 60% నిధులు కేటాయిస్తూ కార్మికులను తీవ్రంగా నష్టం చేసిందన్నారు. దేవుని పేరుతో మారుస్తూ తీవ్రంగా నష్టం చేస్తుందన్నారు. పెట్టుబడిదారుల కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా ఈ పథకాన్ని బిల్లు మారుస్తుందన్నారు. వికాసిత్ భారత్ 20047 లో ఈ పథకాన్ని చేర్చాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును పార్లమెంట్లో వ్యతిరేకించాలన్నాఈ బిల్లును పార్లమెంట్లో వ్యతిరేకించాలని అన్నారు. ఉపాధి హామీ పేరుతోనే యధావిధిగా కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరింకల మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు అజయ్, సంతోష్, ఏరియా కమిటి సభ్యులు లచ్చాగౌడ్, నాయకులు కొమురయ్య, యాదగిరి, సత్తెమ్మ, సాయిలు, సత్తయ్య, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ న్యాయవాదులకు

# సూచనలు సలహాలు

**సమావేశంలో పాల్గొన్న పాలకుర్తి**



నల్లగొండ (ప్రశ్న న్యూస్) నల్గొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాక్ష్య విలువలు చట్టబద్ధమైన నిబంధనలు అనే అంశంపై శనివారం సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి



ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయవాది మా బార్ అసోసియేషన్ సభ్యుడు పాలకుర్తి కిరణ్ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంతో విభేదిస్తున్న బాధితుడు పిల్లల వయసు నిర్ధారణ డిఎన్ఏ నివేదిక పరీక్ష గుర్తింపు పరేడ్ అనే తదితర విషయాలపై దాదాపు 150 మంది జూనియర్ న్యాయవాదులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పులిజాల రాఘవ రంగారావు జ్ఞాపకార్థం పుస్తకాలు పంపిణీ చేశారు.

## బోయినపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో

# తాగునీటి సౌకర్యానికి శ్రీకారం

- **తాగునీటి సౌకర్యం కల్పించిన కేంద్రమంత్రి : బండి సంజయ్**
- **భాజపా కౌన్సిల్ జిల్లా సభ్యులు : ఉదారి నరసింహా చారి**
- **హర్షించి కృతజ్ఞతలు తెలిపిన గ్రామాల ప్రజలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు మల్లాపూర్ గ్రామంలో తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్లను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తగ్గించడమే లక్ష్యంగా ఈ బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహా చారి మాట్లాడుతూ, "గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితిని గమనించి బండి సంజయ్ గారు సీఎస్ఆర్ నిధులతో బోర్లు మంజూరు చేయడం అభినందనీయం. ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఆయన సేవలు ప్రశంసనీయం" అని అన్నారు. బోర్ల ప్రారంభంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అభివృద్ధి పనులు భవిష్యత్తులో మరింతగా కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్, బూత్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్,భోగోజి గంగాధర్ చారి, ఇల్లందుల పరశురామ్‌తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## యావత్ బీసీ సమాజానికి

# గర్వకారణం సంత్ గాడ్గేబాబా

**బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు : కొండ దేవయ్య పటేల్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) మహారాజ్ సంత్ గాడ్గే బాబా 69వ వర్ధంతి సందర్భంగా వేములవాడ ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ, రాజక కులంలో జన్మించిన సంత్ గాడ్గే బాబా గొప్ప సంఘ సంస్కర్తగా యావత్ బీసీ సమాజానికి గర్వకారణమని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరుతో విశ్వవిద్యాలయం, పోస్టల్ స్టాంపు వంటి కార్యక్రమాలు చేపట్టడం ఆయన సేవలకు నిదర్శనమన్నారు.అనంతరం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జ్ పొలాస నరేందర్ మాట్లాడుతూ, శుభ్రత, భక్తి, సామాజిక చైతన్యంతో ప్రజలను ప్రేరేపించిన మహానుభావుడని కొనియాడారు. రూరల్ మండల అధ్యక్షులు లింగంపల్లి దేవయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అన్ని బీసీ కులాల పాల్గొనడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నావికాదళ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు ముఖ్యఅతిథిగా మందముల పరమేశ్వర్ రెడ్డి.




నాచారం(ప్రశ్న న్యూస్) నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నాచారంలోని పలు పాఠశాలు పాల్గొన్నాయి. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో గెలిచిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పోటీల్లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్య తో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. పాఠశాలలు కూడా విద్యార్థులు క్రీడల వైపు మగ్గు చూపే విధంగా కృషి చేయాలి అన్నారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. యువత ప్రస్తుతం డ్రగ్స్ కు బానిస అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి క్రీడల వైపు మొగ్గ చూపాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ గేమ్ లకు అలవాటు పడకుండా గ్రౌండ్ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నావికా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుకులు, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాచారం స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# బ్లాక్ స్పాట్లను పరిశీలన




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఇతర అధికారులతో కలిసి నిజామాబాద్ నగర శివార్లలో తరుచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాక్లూర్ మండలం మానిక్ బండార్ చౌరస్తా సమీపంలోని సుఖ్ జిత్ స్టార్చ్ మిల్ వద్ద, బోధన్ రోడ్డు లోని ఎన్.ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల ప్రధాన రహదారులను సందర్శించారు. పై ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు గల కారణాల గురించి పోలీస్, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా బోధన్ రోడ్ ఎన్.ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వద్ద గడిచిన మూడు సంవత్సరాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఈ సందర్భంగా ప్రమాదాల తీవ్రతపై కలెక్టర్ ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాద ఘటనలలో అత్యధిక మరణాలు చోటుచేసున్న వాటిలో నిజామాబాద్ జిల్లాలోని ఈ ప్రాంతం 20వ స్థానంలో ఉందన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, రోడ్డు విస్తరణ పనులు జరిపించాలని ఆర్ అండ్ బీ, పోలీస్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. మానిక్ బండార్ సమీపంలోనే కాకుండా, జిల్లా వ్యాప్తంగా గల అన్ని రహదారులపై బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో ప్రమాదాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా ట్రాఫిక్ నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్లను పరిశీలించిన అధికారుల బృందంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎం.వీ.ఐ డి.శ్రీనివాస్, ఆర్ అండ్ బీ అధికారి ప్రవీణ్, ఈదార్ మేనేజర్ హర్ష తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛ సమాజ నిర్మాణానికి

# ఆద్యుడు సంత్ గాడ్గే బాబా

- **తెలంగాణ రాష్ట్ర చాకలి ఐలమ్మ ఉత్సవ కమిటీ**

**మాజీ కన్వీనర్, పట్టణ కాంగ్రెస్ నేత : మైలారం రాము**



వేములవాడ (ప్రశ్న న్యూస్) సంత్ గాడ్గే బాబా 69వ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం మాజీ కన్వీనర్, వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు మైలారం రాము సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గే బాబా చిత్రపటాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా మైలారం రాము మాట్లాడుతూ ు మహారాష్ట్ర గడ్డపై రజక కుటుంబంలో జన్మించి, సమాజ హితమే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ గాడ్గే బాబా అని పేర్కొన్నారు. తండ్రి జింగ్రాడ్, తల్లి సక్కుబాయి కుమారుడిగా పుట్టిన గాడ్గే బాబా చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను అనుభవిస్తూ, మానవ సేవే పరమార్థమని నమ్మి ముందుకు సాగారని తెలిపారు. పరిశుభ్రతే ఆరోగ్యకరమైన సమాజానికి మూలమని విశ్వసించిన గాడ్గే బాబా గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కల్పించారని, నేటి రోజుల్లో మనం మాట్లాడుకునే స్వచ్ఛత భావనను అప్పుడే ఆచరణలో పెట్టిన మహనీయుడు ఆయనేనని కొనియాడారు. అలాగే విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి అనేక పాఠశాలల స్థాపనకు కృషి చేశారని, పేద%-%బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందేలా చేసి జ్ఞానం ద్వారా సమానత్వాన్ని సాధించాలని బోధించారని గుర్తు చేశారు. సామాజిక సంస్కరణలే శాశ్వత సంపదగా భావించిన సంత్ గాడ్గే బాబా జీవితం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొంటూ, వారి 69వ వర్ధంతి సందర్భంగా ఆ మహాత్ముని సేవలను స్మరించుకుంటూ హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నామని మైలారం రాము తెలిపారు.

## జీపీ ఎన్నికల విజయవంతంపై

# ఇంచార్జి కలెక్టర్‌కు శుభాకాంక్షలు

- **మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది**



బోయినిపల్లి / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ కు జిల్లాలోని ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్‌ను ఎంపీడీఓలు, పంచాయతీ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో తీసుకున్న చర్యలను అభినందిస్తూ, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం వల్లే ఎన్నికలు సాఫీగా పూర్తయ్యాయని ఈ సందర్భంగా పలువురు అధికారులు పేర్కొన్నారు.



## షూటింగ్‌లో తీవ్రంగా

# గాయపడ్డ ఆది

షూటింగ్ సమయంలో నటీనటులు గాయపడటం కొత్తేమి కాదు. ఎంతో మంది హీరోలు యాక్షన్ సీన్స్ చేస్తుండగా.. గాయపడ్డారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల 'కాంతార:చాప్టర్1' షూట్ జరుగుతండగా.. ఏకంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు ఇటీవల చాలానే చోటుచేసుకుంటూ అభిమానుల్లో ఆందోళనను కలిగిస్తున్నారు. తాజాగా, మరో హీరో యాక్షన్ సీన్స్ చేస్తుండగా.. గాయపడినట్లు మూవీ మేకర్స్ వెల్లడించారు. ఆది సాయి కుమార్ 'శంబాల' మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సీన్స్ షూట్ జరుగుతుండగా.. అనుకోకుండా.. ఆది తీవ్రంగా గాయపడ్డారు. రాత్రి పూట షూటింగ్‌లో చాలామంది నటీనటులున్నారు. వారి కోసం ఆది రెస్ట్ తీసుకోకుండా గాయాలతోనే రాత్రి మొత్తం షూటింగ్‌లో పాల్గొని సినిమా పట్ల తనకున్న డెడికేషన్‌ను చూపించారని చిత్రబృందం ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు కాస్త ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు కోలుకున్నాడా? లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు అయితే ఆదిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కాగా.. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శంబాల' ఏ మిస్టిక్ వరల్డ్ అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతుంది. ఇందులో ఆదికి జోడీగా అర్చనా అయ్యర్ నటిస్తుంది. ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'శంబాల' క్రిస్మస్ కానుకగా విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన అన్ని బిజినెస్‌లు క్లోజ్ అయ్యాయి. హాట్ కేక్‌లా ఓటీటీ, శాటిలైట్స్ రైట్స్ భారీ ధరకు అమ్ముడయ్యాయి. నైజాంలో మైత్రీ ఏపీలో సీడెడ్‌లో ఉషా పిక్చర్ వంటి భారీ సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి.



## లవ్ అండ్ యాక్షన్ డ్రామా

# 'డెకాయిట్'



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'డెకాయిట్'తో అలరించబోతున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ లవ్, యాక్షన్ డ్రామాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ కాగా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. కాగా శేష్ పుట్టినరోజు సందర్భంగా అద్భుతమైన టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ లవ్ స్టోరీ, రూత్ లెస్ జర్నీ, ఒక పెద్ద లక్ష్యంతో నడిచే హీరోని ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, దోపిడీ ఈ రెండు ప్రధాన అంశాల చుట్టూ కథనం అద్భుతంగా వుంది.మొదటిసారిగా మాస్-ఓరియెంటెడ్ పాత్రలో కనిపించిన అడివి శేష్ అదరగొట్టారు. మల్టీ షేడ్స్‌తో.. రగ్గడ్ అవతార్‌లో హీరో కనిపించిన తీరు అదిరిపోయింది. మదనపల్లె యాసలో మాట్లాడిన విధానం ఆకట్టుకుంది. మృణాల్ ఠాకూర్ పాత్ర శేష్ పాత్రతోపాటు ప్రయాణిస్తూ.. అమాయకత్వం, ఎమోషన్ మధ్య ఊగిసలాడుతూ కథనానికి డెప్త్‌ను జోడిస్తుంది. టీజర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్‌లను కీలక పాత్రలలో పరిచయం చేస్తుంది. అనుభవజ్ఞులైన నటుల అద్భుతమైన తారాగణం శక్తివంతమైన ఆన్-స్క్రీన్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధంగా వుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సాంకేతికంగా టీజర్ అత్యున్నతంగా వుంది.

## 'గుర్రం పాపిరెడ్డి'తో

# ప్రేక్షకులకు కంప్లీట్ ఎంటర్‌టైన్‌మెంట్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా "గుర్రం పాపిరెడ్డి". ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు.డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. "గుర్రం పాపిరెడ్డి" సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో సినిమా హైలైట్స్ తెలిపారు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా. – "గుర్రం పాపిరెడ్డి" సినిమాలో నేను సౌధామిని అనే క్యారెక్టర్ లో నటిస్తున్నాను. సౌధామిని నర్సుగా పనిచేస్తుంటుంది. డాక్టర్ చదువుకోవాలని అనుకుంటుంది. ఈ క్రమంలో గుర్రం పాపిరెడ్డి పరిచయమై తన కథంతా మార్చేస్తాడు. ఆయన గ్యాంగ్ తో కలిసి సౌధామిని ఒక దోపిడీలో భాగం కావాల్సివస్తుంది. తెలివైన వారు, తెలివి తక్కువ వారి మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. నేను తెలివైన వారిలో ఉన్నానా, లేక తెలివి తక్కువ వారిలో ఉన్నానా అనేది సినిమాలో చూడాలి. బ్రహ్మానందం గారు జడ్జి క్యారెక్టర్ లో నటించారు. ఆయన ముందు మేము కోర్టులో ఉంటాం. డిఫరెంట్ గెటప్స్ లో కోర్టుకు వెళ్తాం. వరుసగా ఎంటర్ టైనింగ్ మూవీస్ లోనే నటించే అవకాశాలు వస్తున్నాయి. ఈ జానర్ సినిమాలంటే నాకు ఇష్టం. అందుకే వాటిని రిజెక్ట్ చేయకుండా నటిస్తున్నా. నాకు ఇంటెన్స్ క్యారెక్టర్స్ కూడా చేయాలని ఉంది. భగవంతుడు అనే మూవీలో ఇంటెన్స్ క్యారెక్టర్ చేస్తున్నా. ఆ సినిమా షూటింగ్ ప్రస్తుతం హోల్డ్ లో ఉంది. ఆ సినిమాలో విలేజ్ గర్ల్ గా డిఫరెంట్ గా కనిపిస్తా. "గుర్రం పాపిరెడ్డి" సినిమాలో వైవిధ్యమైన గెటప్స్ లో కనిపిస్తా. సమ్మర్ లో ఆ గెటప్స్ తో షూటింగ్ చేశాం. మేకప్ తో రెడీ అయ్యేందుకు చాలా టైమ్ పట్టేది. అయితే యాక్టర్స్ కు ఇలా విభిన్నమైన మేకోవర్స్ లో కనిపించే అవకాశం తక్కువసార్లు వస్తుంది. జాతిరత్నాలు సినిమాలోని చిట్టి పాత్రతో సౌధామినిని పోల్చలేం. రెండూ వేర్వేరు తరహా పాత్రలు. చిట్టి అమాయకురాలు, కానీ సౌధామిని ఇంటెలిజెంట్ గా ఉంటుంది. నాకు ఫ్యూచర్ లో డైరెక్షన్ చేయాలనే ఆలోచన ఉంది. కాబట్టి ఈ సినిమా సెట్ లో టైమ్ దొరికినప్పుడు కొత్త కాన్సెప్ట్స్ స్క్రిప్ట్స్, క్యారెక్టర్స్ ఆలోచించేదాన్ని. నరేష్ అగస్త్య కూడా రైటర్ కాబట్టి అతనూ నా స్క్రిప్ట్స్ తయారీలో సపోర్ట్ చేసేవాడు.



## వారు ఇలా చేస్తారని

# అస్సలు ఊహించలేదు

హిందీ సీరియల్స్ ద్వారా ఫేమస్ అయిన మృణాల్ ఠాకూర్ నటనపై ఆసక్తితో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చింది. దుల్కర్ సల్మాన్ సరసన 'సీతారామం' మూవీలో సీతగా నటించిన ఈ భామ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి ప్రేక్షకులను మంత్రమగ్దులను చేసింది. ఒక్క సినిమాతో అమ్మడు ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఊహించని పాపులారిటీ రావడంతో పాటుగా వరుస అవకాశాలు వచ్చాయి. ఇక ఆమె నటించిన చిత్రాల్లో 'హాయ్ నాన్న' బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించింది. అంతేకాకుండా ఈ సినిమాకు పలు అవార్డులు కూడా వచ్చాయి. ఇక గత ఏడాది 'కల్కి'లో కీలక పాత్రలో కనిపించిన మృణాలం మంచి క్రేజ్ రాబట్టుకుంది. ప్రజెంట్ బాలీవుడ్ సినిమాలపై ఫోకస్ పెట్టింది. అలాగే తెలుగులో అడివి శేష్ సరసన 'డెకాయిట్' మూవీలో హీరోయిన్‌గా కనిపించనుంది. అయితే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈక్రమంలో.. మూవీ మేకర్స్ 'డెకాయిట్' టీజర్ లాంచ్ చేశారు. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొన్న మృణాల్‌కు పలు ప్రశ్నలు ఎదురవగా.. ఆమె సమాధానాలు ఇచ్చింది. హిందీ, తెలుగు ఇండస్ట్రీలో సినిమాలు చేయడంపై మాట్లాడుతూ.. "ఈ సినిమా నా కెరీర్‌లో మరో మైలురాయి అవుతుంది. అడివి శేష్‌తో స్క్రీన్‌షేర్ చేయడం ఓ మంచి అనుభవం. స్క్రిప్ట్ వినగానే నేను చాలా ఎగ్జైట్ అయ్యాను. నా క్యారెక్టర్ చాలా దృఢమైనది. భావోద్వేగాల మేళవింపు ఉన్న పాత్ర. అయితే హిందీ, తెలుగు సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేయడం అంత సులభం కాదు. కానీ నేను బ్యాలెన్స్ చేయడానికి నా వంతు ఉత్తమ ప్రయత్నం చేస్తున్నాను. నా హృదయానికి చాలా దగ్గరైన తెలుగు సినిమాలు చేయాలనుకుంటున్నాను. అవి నన్ను కదిలించాలి.

## హోటల్‌కి రమ్మని

# నన్ను బలవంతం చేశాడు



గత కొద్ది కాలంగా సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ పదం మార్మోగిపోతుంది. సినీ తారలు తమకు ఎదురైన అనుభవాలను ధైర్యంగా చెబుతూ వార్తల్లో నిలుస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గతంలో చాలామంది హీరోయిన్లు తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్న విషయం తెలిసిందే. తాజాగా, మరో నటి తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని వివరించింది. బాలీవుడ్ బ్యూటీ మాల్టీ చాహర్ (%మీుశ్రీఱ జష్టుష్టుతీ%)ఇటీవల సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న బిగ్‌బాస్ సీజన్-19లో కనిపించిన ఆమె ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరై.. షాకింగ్ విషయాలు చెప్పింది. "ఒక ఆఫీస్ మీటింగ్‌లో వీడ్కోలు సమయంలో నాకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఓ దక్షిణాది నిర్మాతతో సమావేశమైనప్పుడు అతను హోటల్ గది నంబర్ నాకు ఇచ్చాడు. నేను సాధారణంగా పిలిచాడని వెళితే.. నన్ను ముద్దు పెట్టుకోవాలని ప్రయత్నించాడు. అది నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. వెంటనే అతన్ని నేను అడ్డుకున్నాను. కానీ అతను నన్ను బలవంతం చేశాడు. అయినా అక్కడి నుంచి తప్పించుకున్నాను. ఆ తర్వాత అతనితో అన్ని సంబంధాలను తెంచుకున్నా. అక్కడే అతన్ని నిలదీశా. నువ్వు నా తండ్రిలా అనుకున్నానని చెప్పా ఆ సంఘటన నాకు ఒక గుణపాఠం నేర్పింది. ఎవరినీ కూడా ఉన్నత స్థానంలో ఉంచొద్దని నిర్ణయానికి వచ్చాను. మహిళలు అవకాశాలు కోసం ఇలాంటి వాటికి అంగీకరించవద్దు. మీపై మీకు నియంత్రణ ఉండాలి" అని చెప్పింది. కాగా.. మాల్టీ చాహర్ సినిమాల విషయానికొస్తే.. 2018లో అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చి 'జీనియస్' (%+వఅఱబం%)మూవీలో రూబీనా పాత్రలో కనిపించింది. అలాగే 'ఇష్క్ పాష్మినా' చిత్రంలో కూడా నటించిన ఆమె సోషల్ మీడియాలోనూ తన హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ప్రస్తుతం పెద్దగా సినిమా అవకాశాల ఎక్కువగా రాకపోవడంతో.. అనేక బ్రాండ్లకు ప్రచారకర్తగా పనిచేస్తోంది.

## నాకు ఒక

# పెద్ద ప్రమాదం జరిగింది



కన్నడ స్టార్ కిచ్చా సుదీప్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'ఈగ' మూవీలో కిచ్చా సుదీప్ విలన్‌గా కనిపించి ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నాడు.ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో కిచ్చా రేంజ్ మారిపోయింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ పెద్దగా హిట్ అందుకోలేకపోయాయి. ఇక గత ఏడాది వచ్చిన 'మ్యాక్స్' కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం కిచ్చా సుదీప్ 'మార్క్' చిత్రంతో రాబోతున్నారు. ఆయన కెరీర్‌లో 47వ ప్రాజెక్ట్‌గా రానుంది. షూట్ పూర్తి చేసుకుని క్రిస్మస్ కానుకగా రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ జోరు పెంచిన కిచ్చా సుదీప్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. "నా మొదటి సినిమా షూటింగ్ పూర్తి కాలేదు. నా రెండో మూవీ విడుదల కాలేదు. నా మూడో సినిమాలో కేవలం మూల సీట్లు మాత్రమే నిండాయి. ఆ సమయంలో, మా నాన్న నాకు మరో అవకాశం ఇచ్చి, నా తర్వాతి ప్రాజెక్ట్ కూడా విఫలమైతే, నువ్వు ఇండస్ట్రీని వదిలేయాలని చెప్పారు. అప్పుడు చియాన్ విక్రమ్ నటించిన సేతు సినిమాను కన్నడలో రీమేక్ చేశారు. గుండు లుక్ కారణంగా చాలా మంది నటీనటులు ఆ సినిమాను తిరస్కరించారు. నేను ఆ సినిమాను అంగీకరించాను. షూటింగ్ ఏడవ రోజున నాకు ఒక పెద్ద ప్రమాదం జరిగింది. చివరికి ఆ సినిమా విడుదలైంది.. నాకు నా కెరీర్‌లో ఒక పెద్ద బ్రేక్ లభించింది" అని అన్నారు. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# అదే నా డ్రీమ్



'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఇక ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అలా రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. ఇక 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి. దీంతో బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తుంది. ఇక ఈ భామ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే నిర్మాత జాకీ భగ్నానిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి భర్తతో మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా టాలీవుడ్ నుండి బాలీవుడ్ వరకు ఎందరో హీరోయిన్‌లకు వివిధ సినిమాలలో మేకప్ వేస్తూ వచ్చిన ప్రముఖ మేకప్ మాన్ కడాలి చక్రవర్తి(చక్రి) హైదరాబాద్‌లోని పంజాగుట్టలో నూతనంగా "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో, అకాడమీ" ప్రారంభించడం జరిగింది. గతంలో రకుల్ ప్రీత్ సింగ్, తమన్నా వంటి ఎందరో స్టార్ హీరోయిన్లకు మేకప్ మెన్‌గా పనిచేసిన చక్రి తానే సొంతంగా ప్రారంభించిన ఈ నూతన మేకప్ స్టూడియోను ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.

## ఈ నెల 23 న ' మీ డబ్బు..

# మీ హక్కు' ప్రత్యేక శిబిరం

**కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ప్రజలు క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమయిన ఆస్తులను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ' మీ డబ్బు – మీ హక్కు ' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 న మెదక్ కలెక్టరేట్ లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామని లికలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, భీమా పాలసీలు తదితర ఆర్థిక ఆస్తులు యజమానులకు చేరేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సొమ్ము ప్రజలకే చేరాలన్న ఉద్దేశ్యంతో ఆర్బీఐ, ఐఆర్డిఎఐ, పిఎఫ్ఆర్డిఏ వంటి జాతీయ స్థాయి సంస్థలు, బ్యాంకులు, భీమా కంపెనీలు ఉమ్మడిగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నాయన్నారుశిబిరంలో ఆస్తులు క్లెయిమ్ ల విధానం పై మార్గ నిర్దేశం చేస్తారన్నారు. బ్యాంకుల్లో పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్న పౌరులు ఉద్గం వెబ్ సైట్ ద్వారాసులభంగా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ను కలిసిన పోతన శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ దయాకర్ గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని శనివారం నాడు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన పోతంశెట్టిపల్లి నూతన సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ ఉప సర్పంచ్ గుండు నాని మరియు వార్డు సభ్యులు ఈ సందర్భంగా రఘునందనరావును నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను శాలువతో పూలమాలతో ఘనంగా సత్కరించిన ఎంపీ మాధవనేని రఘునాథన్ రావు ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కుల్చారం మండల వ్యాప్తంగా ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మహిపాల్ , దాసు, అశోక్, వార్డు సభ్యులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాన్వాడలో అక్రమ ఇసుక నిల్వ

## - నిందితుడిపై కేసు నమోదు

**- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, మాన్వాడ గ్రామానికి చెందిన తాల్లపెల్లి చంద్రయ్య అనే వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తన సొంత భూమిలో సుమారు 11 ట్రాక్టర్ లోడ్ల ఇసుకను అక్రమంగా నిల్వ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై బోయినిపల్లి తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు బోయినిపల్లి ఎస్సై ఎన్. రమాకాంత్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన గొట్టిపాటి లక్ష్మీ



దర్శి (ప్రశ్న న్యూస్) దర్శి నియోజకవర్గం లోని 135 లబ్ధిదారులకు 82,36,297 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు శనివారం దర్శి టిడిపి ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యాడ్ చైర్మన్ దారం నాగవేణి – సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వర్ రెడ్డి, మోడీ ఆంజనేయులు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా, నియోజకవర్గం లోని వివిధ హెూదాల్లో ఉన్న కూటమి శ్రేణులు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులారా స్వచ్ఛత ఆరోగ్యం పట్ల

# అవగాహన కలిగి ఉండాలి

**– కమిషనర్ పులి శ్రీనివాసులు**

గుంటూరు ( ప్రశ్న న్యూస్ )విద్యార్థుల్లో స్వచ్ఛత, ఆరోగ్యం పట్ల కల్గించే అవగాహన యావత్ ప్రజానీకానికి వేగంగా చేరుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. అభ్యుదయ మహిళా విద్యా సంస్థల డైరెక్టర్ బి.రోహిణి దేవి ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్ లోని మధర్ థెరిస్సా విగ్రహం దగ్గర దోమలపై దండయాత్ర పేరుతో జరిగిన అవగాహన మానవహారం, ఫ్లాష్ మాబ్ లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం ఒక ప్రత్యేక థీమ్ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నగరంలో కూడా వివిధ వార్డ్ ల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యుదయ మహిళా విద్యా సంస్థలు దోమలపై దండయాత్ర పేరుతో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత తద్వారా అందే ఆరోగ్యం పై అవగాహన కల్గించడానికి



ముందుకు రావడాన్ని నగరపాలక సంస్థ నుండి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులే భావి భారత నిర్మాతలని, వారిలో ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత పట్ల అంకితభావం కల్గించగలిగితే స్వచ్ఛ గుంటూరు, స్వచ్ఛ



ఆంధ్రప్రదేశ్ సాకారమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాదా మాధవి, రోటరీ క్లబ్ ఆదర్స్ ప్రెసిడెంట్ అనురాధ, పి.సత్యవాణి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# బంగారం అసోంటి నరుసన్నను చంపితివి కదే వజ్రవ్వ

**నరసయ్యది హాత్యా,**

**ఆత్మహత్య,**

**సహజ మరణమా.?**

**భర్త శవాన్ని పోస్టుమార్టంకు,**

**భార్యను పోలీస్ స్టేషన్ కు**

**తరలించి విచారణ**

**జరుపుతున్న పోలీసులు**

**పొలం పనులకు వెళ్లి ఇంటికి**

**వచ్చి నిద్రలో చనిపోయినట్లు**

**ప్రచారం**

ఎల్లారెడ్డి పేట( ప్రశ్న న్యూస్) తన భర్త ను మరొకరి సహాయంతో హాతమార్చి అనుమానం రాకుండా సాధారణ మృతిగా నమ్మించి శవాన్ని దహానం చేసేందుకు పాడే పై తీసుకెళ్తుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు హూటాహూటిన అక్కడికి చేరుకుని నడుమంత్రాన పాడేను దించి శవాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోస్టుమార్టం చేయడానికి మార్చారికి తరలించిన ఘటన రాజన్నపేట గ్రామంలో కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్నపేట గ్రామానికి చెందిన ఏర్పుల నర్సయ్య (58) బ్రతుకు దెరువు కోసం గత కొన్నేళ్ళుగా గల్ఫ్ లో ఉన్నాడు. రెండు సంవత్సరాలకోసారి స్వగ్రామానికి వచ్చి వెళు తుంటాడు. నవంబర్ 26వ తేదీన రాజన్న పేటకు వచ్చి నర్సయ్య తన పెద్ద కుమారుని వివాహం జరిపించాడు. శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పొలం పనులు చూసుకొని ఇంటికి తిరిగి రాగా ఇంటి వద్ద ఉన్న తన భార్య వజ్రవ్వ తో మరొక వ్యక్తి కలిసి ఉండడంతో నర్సయ్యకు అతని భార్య వజ్రవ్వకు తీవ్ర స్థాయిలో గోడవ జరిగిందని ఇరువురు కలిసి నర్సయ్యను తాడుతో ఉరిపోసి చంపి అనుమానం రాకుండా గుండెపోటుతో తన భర్త నర్సయ్య చనిపోయినట్లు గ్రామస్తులను, కులస్తులను, కుటుంబ సభ్యులను నమ్మించి మధ్యాహ్నం వరకు దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసిందని గ్రామస్తులు ఆరోపించారు. పెద్ద కుమారుడు మధు, కూతురు మౌనిక, చిన్న కుమారుడు








యోగిలు శుక్రవారం రాత్రికి ఇంటికి చేరుకున్నారు. కాగా శవాన్ని డప్పు చప్పుల మధ్య పాడేపై స్థానిక స్మశాన వాటికలో దహాన సంస్కారాలు నిర్వహించడానికి తీసుకెళ్తుండగా నర్సయ్య మెడ నల్లగా ఉండడంతో అక్కడున్నవారు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఘటన స్థలానికి ఎల్లారెడ్డిపేట పోలీసులు హూటా హూటిన చేరుకొని శవాన్ని మార్గమధ్యలో కిందికి దించి సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలోని పోస్ట్ మార్టం తరలించి మార్చారిలో భద్రపరిచి, నర్సయ్య భార్య వజ్రవ్వను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.హత్యానా, ఆత్మహత్యనా, సాధారణ మరణమా అనేది పోలీసుల విచారణలో తేలనుంది.

**పాడెను కాట్నంలో పెట్టి దాహానం చేసిన గ్రామస్తులు**

నర్సయ్య శవాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపరిచి అతని భార్య వజ్రవ్వ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతుండడంతో గ్రామస్తులు పాడేలో ఒక ప్రాణంతో ఉన్న కోడిని డప్పు చప్పుల్లతో స్మశాన వాటికకు తీసుకొని వెళ్లి, కాట్నంలో పెట్టి దహానం చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అయింది.

## క్రిస్మస్ మీ జీవితంలో కీయేగ నయా జోష్.ఆల్ఫోస్ రెడ్డి

# అన్ని పండుగలతో ఆకట్టుకునే "సెయింట్ పీటర్స్ స్కూల్"

**విద్యార్థులకు పర్వదినాల గొప్ప తనం తెలియజేయడం స్పెషల్**

**గత కొన్నేళ్లుగా పాఠశాల విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్న ఉపాధ్యాయులు**

**ఈ స్కూల్ నుంచి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, సమాజానికి సాహసోపేతమైన సేవలు అందిస్తున్నారు**

**విద్యారంగంలో (బహిరంగ మార్కెట్లో) కోట్లు పెట్టిన దొరకని డిగ్రీలు, "సెయింట్ పీటర్స్ హై స్కూల్"లో ప్రతిభతో దగ్గరౌతున్నాయి.**

**శాస్త్రవేత్తలు,వైద్యులు పలు కీలక వృత్తుల్లో స్థిరపడిన ఆణిముత్యాలు**

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డిసెంబర్ మాసంలో క్రిస్మస్ వేడుకలు తెలంగాణ రాష్ట్రంలో అంబరాన్ని తాకేలా ఏర్పాట్లు చేస్తున్నారు."మేరీ క్రీస్మస్ "గొప్ప తనం అందరికి తెలుసే విధంగా చర్చులు ముస్తాబవుతున్నాయి.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ బోయిన్ పల్లి లోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ ఆల్ఫోన్ రెడ్డి తుమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులతో కలిసి క్రిస్మస్ సంబరాలను జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు చిన్నారులు ఉపాధ్యాయులతో కలిసి ఆలపించిన క్రిస్మస్ కెరొల్స్ మధుర అనుభూతిని కలిగించగా, పాఠశాలలోని ప్రతి ఒక్కరిలో క్రిస్మస్ స్ఫూర్తి కలిగించిందని అయన తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, శాంతా క్లాస్ సందడి విద్యార్థులను,



చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.యేసు జన్మ వృత్తాంతాన్ని తెలియజేసేలా వేసిన నాటికలు సైతం అందరినీ అబ్బురపరిచాయి. అలాగే గత కొన్నేళ్లుగా వివిధ రకాల పర్వదినాలు ఘనంగా జరపడమే కాకుండా వాటి ప్రత్యేకత విద్యార్థులకు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు



తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక బహుమతులను విద్యార్థులకు అందజేసినట్లు తుమ్మ ఆల్ఫోస్ రెడ్డి తెలిపారు. ఈ క్రీస్మస్ పిల్లల జీవితాల్లో కొత్త నాంది పలకాలని, అలాగే పసి ప్రాయంలో ఉన్న ఆనందం జీవితాంతం ఉండాలని, జీవితంలో వచ్చే సమస్యలు తొలగిపోవాలని, ప్రతి ఏటా వచ్చే క్రీస్మస్ పండుగ రోజున ఎలాంటి తారతమ్యాలు లేకుండా ముందుకు సాగిపోవాలి. అలాగేదాతృత్వానికి, ప్రేమ, కరుణలకు ప్రతి రూపమే క్రిస్మస్ పండుగ అని ప్రతి ఒక్కరూ సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలోని సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న మహిళ తన కుమారుడి ప్రాణాలు కాపాడేందుకు కిడ్నీ దానం చేయనున్న నేపథ్యంలో ఆమెకు పాఠశాల మద్దతుగా నిలిచి నిధుల సేకరణ చేపట్టి అందజేసి క్రీస్తు చూపిన మానవతా దృక్పథాన్ని చాటుకున్నట్లు తెలిపారు.

## జీపీ ఎన్నికల విజయవంతంపై ఇంచార్జి కలెక్టర్ కు శుభాకాంక్షలు

**మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీడీఓలు,**

**జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది**

సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను శనివారం ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## రోడ్డు నిబంధనలపై ప్రజలకు

# అవగాహన కల్పించేది ఎవరు.?

### - ఆర్టీసీ బస్ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు వర్థించవా.?

- గతి తప్పిన నగర ట్రాఫిక్ - ప్రేక్షక పాత్రలో పోలీసు యంత్రాంగం
- పోలీసుల ముందే రాంగ్ రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్
- టూవీలర్, ఆటోవాలాలే ట్రాఫిక్ సమస్యకు కారణమా.?
- రోడ్డు నిబందనలపై విసృతంగా ప్రచారం చేస్తు ప్రజలకు అవగాహణ కల్పించాలి
- నిర్వీర్యమైన పోలీస్ యంత్రాంగాన్ని పట్టిష్టవంతం చేయాల్సి ఉంది
- గతి తప్పిన ట్రాఫిక్ సమస్యను గాడిన పెట్టే భాద్యత ముఖ్యమంత్రిదే





**కీర్తి సంతోష్ రాజ్ (ప్రశ్న న్యూస్ ప్రతినిధి)**

అసలే గతుకుల రోడ్లు, వాటికి తోడు యూటర్న్ లు. రోడ్డు నిబందనలను తుంగలోతొక్కి ఇష్టానుసారం తమ వాహణాలను అడ్డు అదుపు లేకుండా నడుపుచు తోటి వాహణచోధకులకు తీవ్ర అసౌకర్య పరిస్థితులు సృష్టించడమే కాక రాంగ్ రూట్లలో ప్రయాణిస్తు ప్రమాధాలకు కారణమవుచున్నారు. ముఖ్యంగా యూటర్న్ ల వద్ద టూవీలర్ లు, ఆటోవాలాల రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల ప్రమాధాల సంఖ్య పెరుగుతుందనడంలో అనుమానం లేదు. అంతేకాక యూటర్న్ ల వద్ద తీవ్రమైన ట్రాఫిక్ జాం కావడంతో వాహణదారుల్లో సహణం కోల్పోవడంతో ప్రమాధాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. మరీ యూటర్న్ ల వద్ద ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం లేదు. ముఖ్యంగా ప్రతి నిత్యం సిటీలోకి రావలసిన సంతోష్ నగర్ - కోఠి రోడ్డుపై నల్గోండ చౌరస్తా నుండి కోఠి వరకు, చంద్రాయణగుట్ట - మెహిదిపట్నం రోడ్లపై మెహిఫిల్ రెస్టారెంట్ వద్ద ఉన్న యూటర్న్ నుండి శివరాంపల్లి వరకు అత్యంత తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడుతుండడంతో వాహణచోధకులు తీవ్ర ఇబ్బందులకు గురవుచున్నాను ట్రాఫిక్ పోలీసుల జాడేలేదు. అక్కడక్కడ ఉన్నను ఫోటోలు తీయడం, చాలాన్లు వసూళ్ళకే పరిమితమవడం గమనార్హం. యూటర్న్ ల వద్ద మరింత పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టి ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాధాలను నివాంలించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ఆర్టీసీ బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం..**

నగరంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాతాలలో ఒక కిలోమీటర్ ప్రయాణానికి గంట సమయం పడుతుందంటే సమస్య తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. ఇదిలా ఉంటే 50- 70 మంది ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాల్సిన భాధ్యత ఉన్న ఆర్టీసీ బస్ డ్రైవర్లు బస్ లను నిర్లక్ష్యంగా నడుపుచు రోడ్లపై గందరగోళ పరిస్థితులకు కారణమవడమే కాక ప్రయాణికులను ప్రమాధాల భారిన పడేస్తున్నారు. ట్రాఫిక్ ఉండే సమయాల్లో ఎంతో ఓర్పుతో వాహణాన్ని నడపాల్సిన డ్రైవర్లు ఒకరితో మరోకరు పోటీ పడుతు ఓవర్ టేక్ లు రాంగ్ రూట్లలో డ్రైవింగ్ చేస్తుండడం గమనార్హం. ముఖ్యంగా నల్గోండ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్ డ్రైవర్లు ప్లైఓవర్ ఎక్కి అక్కడే యూటర్న్ తీసుకుంటుండడంతో ప్రమాధాలు జరగడమే కాక విజయవాడ ప్రదాన రహదారిపై తీవ్ర ట్రాపిక్ జామవడం గమనార్హం. అలాగే మెహిదిపట్నం వెల్లే దారిలోని రెడ్ హిల్స్ ప్లైఓవర్ పై బస్సులు, భారీ వాహణాలు ఎక్కేందుకు అనుమతించవద్దని పలువురు ప్రభుత్వాన్ని కోరుచున్నారు. గతంలో మాదిరిగా డ్రైవర్లకు శిక్షణ ఇస్తు రద్దీ ప్రాంతాలలో తమ ఇష్టానుసారం కాకుండా రోడ్డు నిబందనల మేరకు డ్రైవింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుచున్నారు.

**- రోడ్డు నిబంధనలపై అవగాహణ కల్పించాలి**

ప్రధానంగా జాతీయ రహదారులు, రెండు, సింగిల్ లేన్ రోడ్లపై నిబందలను ఉల్లంగించి నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహణాలు. ఆటోలు, భారీ వాహనాలు, కార్లు వంటి వాహణాలు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధిక శాతం వాహనదారులకు అవగాహన లేదు. దీంతో తమ ఇష్టానుసారం వాహణాలను నడుపుచు తోటి వాహణదారులకు ఇబ్బందులు సృష్టించడమే కాక ప్రమాధాలకు కారణమవుచున్నారు. రోడ్డు నిబందనల మేరకు ఏ వాహణం ఏ లేన్ లో వెళ్ళాలనే అంశంపై విసృత ప్రచారం చేస్తు అవగాహణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే టోల్‌గేట్ల నుండి వాహణదారుల ఫోన్ నంబరు సేకరించి సదరు వాహనదారుడిని రోడ్డు ప్రమాదాల నివారణపై అప్రమత్తం చేయాల్సిఉంది. అలాగే హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తు అతి వేగంగా వెళ్లే వాళ్లను గుర్తించి కౌన్సెలింగ్ చేయడం, అవసరమైతే కేసులు నమోదు చేయడంతో ప్రమాధాలను కొంత మేరకు నివారించవచ్చు. రోడ్లపై ఇష్టానుసారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించడమే కాక రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్త్రతంగా ఏర్పాటుచేయాల్సి ఉంది. అలాగే రాత్రి వేళల్లో సంబందిత సిబ్బంది అక్కడక్కడ ఆకస్మిక తనిఖీలు చేసి లారీలు, బస్సుల వంటి భారీ వాహనాల డ్రైవర్ల పరిస్థితిని సమీక్షిచాల్సిన అవసరం ఉంది. కాని తమ భాధ్యతలను మరిచిపోయి ఫోటోగ్రాఫర్ల అవతారం ఎత్తిన పోలీసు శాఖకు ఇలాంటి భాధ్యతలు కష్టతరం కావచ్చు. మరి దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వీర్యమైన ట్రాఫిక్ పోలీసింగ్ వ్యవస్థను పటిష్టవంతం చేసి గందరగోళంగా మారిన నగర ట్రాఫిక్ సమస్యన పరిష్కరించి నగర ప్రతిష్ట మరింత ఇనుమడించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఏసీబీ వలలో వనపర్తి జిల్లా

# వ్యవసాయ శాఖ అధికారి

**- రూ.10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వనపర్తి జిల్లాలో ఓ అవినీతి అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న పుప్పాల ఆంజనేయులు గౌడ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఒక రైతుకు యూరియా బస్తాలు సరఫరా చేసేందుకు గాను ఆంజనేయులు గౌడ్ రూ. 20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే బాధితుడి నుంచి రూ. 3,000 అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగిలిన మొత్తంలో నుంచి రూ. 10,000 నగదును తీసుకుంటున్న సమయంలో, ముందుగా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు డయల్ చేయాలని తెలిపారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.

## మెస్సీ భారత పర్యటన

# ఖర్చు రూ.100 కోట్లు

**- విచారణలో కీలక విషయాలు వెల్లడి**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత పర్యటన కోసం సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీకి రూ. 89 కోట్లు చెల్లించినట్లు ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తా వెల్లడించారు. లియోనల్ మెస్సీ భారత పర్యటన సందర్భంగా కోల్‌కతా స్టేడియంలో చోటుచేసుకున్న ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో శతాద్రు దత్తా అరెస్టై ప్రస్తుతం కస్టడీలో ఉన్నాడు. అతనిని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆయనను విచారిస్తోంది. విచారణలో ఆయన కీలక విషయాలను వెల్లడించాడని తెలుస్తోంది. సమాచారం ప్రకారం, స్టేడియంలోకి రాగానే అనేకమంది తాకడం, కౌగిలించుకోవడం వంటి చర్యలతో మెస్సీ అసౌకర్యానికి గురయ్యాడని, దీంతో అతడు షెడ్యూల్ కంటే ముందుగానే అక్కడి నుంచి వెళ్లిపోయాడని దత్తా చెప్పారు. జనసమూహాన్ని అదుపు చేయాలని పదేపదే ప్రకటించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విచారణలో వెల్లడించారు. మైదానంలోకి రావడానికి 150 మందికి మాత్రమే పాసులు ఉన్నాయని, కానీ అంతకు మూడు రెట్లు ఎక్కువ మంది వచ్చారని తెలిపారు. మెస్సీ పర్యటనకు మొత్తం రూ. 100 కోట్లు ఖర్చయిందని శతద్రు వెల్లడించారు. మెస్సీకి రూ. 89 కోట్లు చెల్లించామని, భారత ప్రభుత్వానికి రూ. 11 కోట్లు పన్నుగా చెల్లించామని తెలిపాడు. ఈ నిధుల్లో 30 శాతం స్పాన్సర్ల ద్వారా, మరో 30 శాతం టిక్కెట్లు విక్రయం ద్వారా సేకరించినట్లు ఆయన చెప్పాడని సమాచారం.

# గేరు మారుస్తారటగా

### - నయా స్ట్రాటజీతో గులాబీ బాస్.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ అవుతున్నారు. జనంలోకి రావడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్ల తర్వాత ఆయన తిరిగి యాక్టివ్ అయ్యేటట్లు కనిపిస్తుంది. ఇన్నాళ్లూ ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితమయిన కేసీఆర్ ఇక తెలంగాణ రాజకీయాల్లో వేగంగా అడుగులు వేయాలని నిర్ణయించుకున్నట్లుంది. బీఆర్ఎస్ వరస ఓటములతో పాటు అనేక పరిణామాలు ఆయనను తిరిగి యాక్టివ్ చేస్తున్నాయంటున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్ల సమయం ఇవ్వాలని అన్నారు. రెండేళ్లు పూర్తి కావడంతో ఇక ఫామ్ హౌస్ నుంచి జనంలోకి వచ్చేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారు. పార్టీ శ్రేణులలో కూడా భరోసా నింపాలన్న ప్రయత్నంలో కేసీఆర్ ఉన్నారు.

**- వ్యూహాత్మక నిర్ణయాలతో..**

అందులో భాగంగానే కేసీఆర్ వ్యూహాత్మకంగా జనంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయంగా దాదాపు నిశ్శబ్దం పాటించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ జనంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఏర్పాట్లకు సంబంధించిన అన్ని చర్చలను ఆయన ఫామ్‌హౌస్ నుంచే నడిపిస్తుండగా నేడు అయితే ప్రత్యక్షంగా తెలంగాణ భవన్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ ఎల్పీ%-%రాష్ట్ర కార్యవర్గాల సంయుక్త సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి కేసీఆర్ స్వయంగా అధ్యక్షత వహించనుండటం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

**- ప్రధాన అంశాలివే..**

కృష్ణా, గోదావరి సాగునీటి హక్కుల పరిరక్షణ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై వ్యూహాత్మక చర్యలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా మరో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బలమైన ప్రణాళిక అంటూ కీలక అంశాలు చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. తాము ప్రభుత్వం సమయంలో 91 టీఎంసీల కేటాయింపుల కోసం ప్రణాళికలు రూపొందించగా, ప్రస్తుత



కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకే అంగీకరించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు లాభం చేరుతోందని, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రమాదమని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ అడ్డుకోవడంలో వైఫల్యం వంటి అంశాలపై కేసీఆర్ బహిరంగంగా ఆక్షేపణలు చేసే అవకాశముంది.

# తెలంగాణాలో బలపడని బీజేపీ

### - అవకాశాలను అందిపుచ్చుకోవడంలో పార్టీ విఫలం
### - ప్రజల సమస్యలు పట్టించుకోని బిజెపి నాయకులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ.. దశాబ్ధ కాలంగా దేశంలో ఒక వెలుగు వెలుగుతోంది. మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా, కొన్ని రాష్ట్రాల్లో మిత్రులతో కలిసి అధికారంలో ఉంది. కానీ తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. ప్రజలు ఆ పార్టీని ఆదరిస్తున్నా, గెలిపించాలని చూస్తున్నా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో పార్టీ విఫలవుతోంది. ఇందుకు తాజాగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హెచ్చరికే నిదర్శనం. ఎంఐఎం పార్టీకన్నా బలహీనంగా ఉందని పోల్చడం ద్వారా తెలంగాణలో పార్టీ పరిస్థితిని ఎంపీలకు గుర్తు చేశారు.

**- సినీ నటుల ఆదరణ..**

బీజేపీకి సినీ నటుల ఆదరణ ఎక్కువ. చాలా మంది టాలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్, మరాఠా, కన్నడ, మళయాలీ నటులు బీజేపీలో ఉన్నాయి. తాజాగా సీనియర్ నటి ఆమని తాజాగా బీజేపీలో చేరనుందని ప్రకటించడంతో పార్టీలో ఉత్సాహం నెలకొంది. అయినా తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. తెలంగాణ ప్రజలు బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆశిస్తున్నారు. అయితే, కొందరు నాయకులు కాంగ్రెస్‌తో, మరికొందరు బీఆర్ఎస్‌తో దగ్గరి సంబంధాలు పెంచుకుంటున్నారు, ఇది పార్టీ ఐక్యతకు సవాల్‌గా మారింది.

**- పంచాయతీ ఎన్నికల్లో విజయం..**

బీజేపీ పంచాయతీ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్‌కు మించి స్థానాలు సాధించింది. ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న ప్రాంతంలో భారీగా పంచాయతీలు గెలవడం నాయకుల స్వేచ్ఛాయుత నిర్ణయాలకు ఉదాహరణ. అయినప్పటికీ, అంతర్గత విరోధాలు పెరగడంతో పార్టీకి కష్టాలు తెచ్చాయి. ప్రధాని మోదీ ఇటీవల హెచ్చరించినా, నాయకుల పద్ధతి మారలేదు.

**- లోక్‌సభ, ఉప ఎన్నికల్లో అవకాశాలు కోల్పోయారు**



లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు ఇచ్చి మద్దతు పొందినా, కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో త్వరిత నిర్ణయాలు తీసుకోలేక భారీ నష్టం అయింది. సర్పంచ్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చినా, అధిష్టానం నాయకులకు స్వతంత్రత ఇవ్వడంలో విఫలమవుతోంది. ఇలా కొనసాగితే చారిత్రక తప్పు జరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పార్టీలో అందరూ పనిచేసే నాయకులు ఉన్నప్పటికీ, అంతర్గత కలహాలు, జాప్య నిర్ణయాలు భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. ఇప్పటికైనా ఐక్యత పెంచి, నాయకుల స్వేచ్ఛను ప్రోత్సహించాలి. లేకపోతే తెలంగాణలో బీజేపీ అవకాశాలు దూరమవుతాయి.

## టాస్క్‌ఫోర్స్ పోలీసులకు

# షాకిచ్చిన సీపీ

**- 80 మంది సిబ్బందిని బదిలీ చేసిన సజ్జనార్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర సీపీ వీ.సీ. సజ్జనార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు షాక్ ఇచ్చారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులపై అవినీతీ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఒక్కసారిగా 80 మంది సిబ్బందిని బదిలీ చేశారు. కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు ర్యాంక్ అధికారులను అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళన కోసమే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా టాస్క్‌ఫోర్స్‌లో అధికారులు బదిలీలు లేకుండా ఉన్నారు. ఇటీవలి కాలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులపై అవినీతి ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఒక నిందితుడిని తప్పించేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో సీపీ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588